


# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 137, పేజీలు - 08

మంగళవారం, సెప్టెంబర్ 17, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## ఈ ఎన్నికలు గాంధీ-అబ్దుల్లా కుటుంబానికి బీజేపీకి మధ్య జరుగుతున్నాయి

**- జమ్మూకాశ్మీర్‌లో అమిత్ షా**



శ్రీనగర్ (ప్రశ్న న్యూస్) జమ్మూకశ్మీర్‌లో జరగనున్న ఎన్నికలు కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్ కూటమికి, బీజేపీకి మధ్య స్పష్టమైన పోటీ అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం అన్నారు. ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలని ఒకవైపు లక్ష్యంగా పెట్టుకుంటే, దానిని అడ్డుకోవాలని బీజేపీ కృతనిశ్చయంతో ఉందని ఆయన ఉద్ఘాటించారు. బీజేపీ అభ్యర్థి షగన్ పరిహార్‌కు మద్దతు ఇవ్వాలని షా ఓటర్లను కోరారు, అలా చేయడం అభివృద్ధిని ప్రోత్సహించడమే కాకుండా పరిహార్ తండ్రితో సహా అమరవీరులను కూడా గౌరవించినట్లు అవుతుందని అన్నారు. "జమ్మూ కాశ్మీర్‌లో ఈ ఎన్నికలు స్పష్టంగా రెండు శక్తుల మధ్య జరుగుతున్నాయి. ఒకవైపు నేషనల్ కాన్ఫరెన్స్ మరియు కాంగ్రెస్, మరోవైపు బీజేపీ. ఇది బీజేపీ మరియు గాంధీ-అబ్దుల్లా కుటుంబాల మధ్య పోటీ. ఇద్దరికీ స్పష్టమైన అజెండాలు ఉన్నాయి" అని షా బహిరంగ ర్యాలీలో అన్నారు.

**-ఎజెండాలను క్లియర్ చేయండి**

'ఒకే రాజ్యాంగం, ఒకే జెండా, ఒకే ప్రధాని' అనే ప్రేమ్‌నాథ్ డోగ్రా సిద్ధాంతానికి బీజేపీ కట్టుబడి ఉందని హోంమంత్రి పునరుద్ఘాటించారు. జమ్మూ కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగంగా ఉందని, ఈ హోదాను మార్చలేమని నిర్ద్వంద్వంగా పేర్కొన్నారు. బిజెపి అభ్యర్థి షగన్ పరిహార్‌కు ఓటు వేయడం యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన అమిత్ షా పరిహార్ గెలుపు కేవలం పురోగతిని మాత్రమే కాకుండా, పరిహార్ తండ్రితో సహా తమ ప్రాణాలను త్యాగం చేసిన వారికి నివాళి అని కూడా ఆయన అన్నారు.

**- అభివృద్ధి, పురోగతి**

సైద్ధాంతిక పోరాటాన్ని హైలైట్ చేస్తూ, కొన్ని వర్గాలు ఆర్టికల్ 370ని తిరిగి తీసుకురావాలని కోరుకుంటుండగా, బిజెపి దానికి వ్యతిరేకంగా గట్టిగా నిలుస్తుందని షా నొక్కి చెప్పారు. షగన్ పరిహార్‌కు మద్దతు ఇవ్వడం వల్ల జమ్మూ కాశ్మీర్‌లో అభివృద్ధి కొనసాగుతుందని ఆయన అన్నారు. భారత్‌లో విడదీయరాని భాగమైన జమ్మూ కాశ్మీర్

7లో..

# కేసీఆర్ ఫాంహౌస్‌లో జిల్లేళ్లు మొలిపిస్తా

- సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహం ఆవిష్కరణ
- కేటీఆర్, కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు
- డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరిస్తామని వెల్లడి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రాన్ని 9 ఏళ్లు పాలించిన బీఆర్ఎస్ నేతలకు తెలంగాణ సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన ఎందుకు రాలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర సచివాలయం ఎదుట ఏర్పాటు చేసిన మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని సోమవారం (సెప్టెంబర్ 16) సాయంత్రం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుపై ఘాటు విమర్శలు చేశారు. డిసెంబర్ 9న రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన ఐటీ సంస్కరణల వల్లే అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో భారతీయులు ఐటీ సంస్థల్లో కీలక పదవుల్లో ఉన్నారని అన్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'రాజీవ్ గాంధీ లేకపోయుంటే, గుంటూరులో ఇడ్లీ, వడ అమ్ముకుంటూ తిరిగెటోడివి. గుంటూరులో చదువుకున్న అని చెప్పినవ్ కదా. లేకపోతే, సిద్ధిపేట రైల్వే స్టేషన్‌లో ఛాయ్, సమోస అమ్ముకునేటోడివి. నీకు కంప్యూటర్, ఐటీ జాబ్, ఐటీ మంత్రి పదవి వచ్చాయంటే అది రాజీవ్ గాంధీ ఘనతే' అని రేవంత్ రెడ్డి అన్నారు.దేశ ప్రజల కోసమే రాజీవ్ గాంధీ ప్రధాని పదవి చేపట్టారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రాజీవ్ గాంధీ తర్వాత సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఏ పదవీ తీసుకోలేదని గుర్తుచేశారు. 'పదవీ త్యాగం అంటే వాళ్లవి. తెలంగాణ బిడ్డ పీవీని ప్రధానిని చేసింది సోనియా గాంధీ కాదా? గాంధీ కుటుంబం గురించి కేసీఆర్ కుటుంబానికి తెలుసా? అడ్డగోలుగా మాట్లాడితే చూస్తూ ఊరుకుంటామనుకున్నారా? మీ ఫాంహౌస్‌లలో జిల్లేళ్లు మొలిపిస్తా. ఎవడొస్తాడ్రా రండి తారీఖు చెప్పండి బిడ్డా' అంటూ సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. గాంధీజీ కలలు కన్న గ్రామ



స్వరాజ్యాన్ని సాకారం చేసిన నేత రాజీవ్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 72, 73వ రాజ్యాంగ సవరణల ద్వారా నేరుగా గ్రామాలకు నిధులు కేటాయించారని చెప్పారు. ఆడబిడ్డలకు రాజ్యాధికారం ఇచ్చారని కొనియాడారు. వేల కోట్ల రూపాయల సంపదను దేశం కోసం త్యాగం చేసిన నాయకుడు, స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లిన వ్యక్తి, స్వాతంత్ర్యం తర్వాత దేశాన్ని ఐక్యంగా ఉంచిన నాయకుడు నెహ్రూ అని రేవంత్ రెడ్డి అన్నారు. నెహ్రూ నిర్మించిన ప్రాజెక్టులు ఇప్పటికీ ఆయన పనితనానికి సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయని కొనియాడారు. 'నెహ్రూ అధికారంలో ఉన్నప్పుడు ఇందిరా గాంధీ

7లో..

## కేజ్రీవాల్ రాజీనామాకు ముహూర్తం ఖరారు

**- నేడు 4.30 గంటలకు రాజీనామా లేఖను సమర్పించనున్న ఆప్ అధినేత**



## మద్యం ప్రియులకు షాక్

**- రెండ్రోజులు వైన్ షాపులు బంద్**



7లో..

## అక్టోబర్ నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం లక్షలాది మంది ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఎక్కువగా జారీ చేయకపోవడంతో చాలా మంది అర్హులు రేషన్ కార్డులు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది.

7లో..


## రాజీవ్ గాంధీ విగ్రహం గాంధీ భవన్‌కు తరలించి తీరుతాం

**- నిరసనలకు పిలుపునిచ్చిన కేటీఆర్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్ర సచివాలయం, తెలంగాణ అమర జ్యోతి మధ్యలో ఉండాల్సిన తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ విగ్రహాన్ని

7లో..






## గ్రీన్ ఎనర్జీకి ఆకాశమే హద్దు

**- ఎలా అమలు చేయాలనేది కీలకం**

- గుజరాత్ లోని గాంధీ నగర్ లో ప్రపంచ పునరుత్పాదక ఇంధన సదస్సు
- హాజలరైన ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు
- ఇంధన రంగానికి అనుకూల వ్యూహాలు అవసరమన్న చంద్రబాబు

**అమరావతి / గాంధీనగర్ (ప్రశ్న న్యూస్)** గ్రీన్ ఎనర్జీ వినియోగంలో అపరిమితమైన అవకాశాలు ఉన్నాయని అయితే దాన్ని ఎలా అమలు చేయాలనేదే కీలకాంశమని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు అన్నారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరుగుతున్న నాల్గో గ్లోబల్ రీ అన్వెస్ట్ రెన్యూవబల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్ అండ్ ఎక్స్‌పోలో ఆయన పాల్గొన్నారు. ప్రపంచ పునరుత్పాదక ఇంధన పెట్టుబడిదారుల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీని కలవడం సంతోషం కలిగించిందని తెలిపారు. ఈ సదస్సుకు హాజరై, ఏపీలో ఉన్న అపారమైన పునరుత్పాదక ఇంధన శక్తిసామర్థ్యాల గురించి వివరించానని వెల్లడించారు. భిన్న రకాల

7లో..

## వరదలకు చెక్ పెట్టేలా ఏపీ ప్రభుత్వం కొత్త స్కెచ్

**- రాజధానిలో మూడు కాల్వలు**

**- వెల్లడించిన మంత్రి పొంగూరు నారాయణ**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో ఏపీ ప్రభుత్వం పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఏ అంటే అమరావతి, పీ అంటే పోలవరం అంటూ తమ ప్రాధాన్యలేమిటో సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తొలినాళ్లల్లోనే చెప్పేశారు. ఆ ప్రాధాన్యాలను అనుసరించి రాష్ట్ర రాజధానిని అత్యున్నతంగా నిర్మించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. రాజధానిలో ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. 80 శాతం పనులు పూర్తికాగా మిగతావాటికి వర్షం ఆటంకం కలిగించింది. అయితే నేటి నుంచి తిరిగి జంగిల్ క్లియరెన్స్ పనులు కూడా ప్రారంభం కానున్నాయి. మరోవైపు భారీ వర్షాలు వస్తే అమరావతి

7లో..

# నిమజ్జనాలకు సర్వం సిద్ధం

**- 30హెల్త్ క్యాంప్స్ ఏర్పాటు చేసిన అధికారులు**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** 9 రోజులపాటు ఘనంగా పూజలు అందుకున్న గణపయ్య.. ఇక గంగమ్మ ఒడికి చేరేందుకు సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే గత కొన్ని రోజులుగా నిమజ్జనాలు ప్రారంభం కాగా.. మంగళవారం రోజున భారీగా గణపతి విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లనున్నాయి. దాదాపు లక్ష విగ్రహాలు నిమజ్జనం అయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ పరిధిలో వినాయక నిమజ్జనాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలోనే నగరవ్యాప్తంగా వేల మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఒక్క



హుస్సేన్ సాగర్ చుట్టే 3వేల మంది పోలీసులు గస్తీ కాయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మహిళల భద్రత కోసం హుస్సేన్ సాగర్ పరిసరాల్లో షీటీమ్స్‌ను మోహరించినట్లు తెలిపారు. ఇక మంగళవారం నగరంలో భారీగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. జీహెచ్ఎంసీ పరిధిలో వినాయక నిమజ్జనాల కోసం గత 2 నెలలుగా పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు అనేక కసరత్తులు చేపట్టారు. ఇక ఈ ఏడాది ఒక్క హుస్సేన్ సాగర్‌లోనే 25 వేల నుంచి 30 వేల విగ్రహాలను నిమజ్జనం చేస్తారని అధికారులు అంచనా

7లో..

## చరిత్రహీనులు కావొద్దు

- ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ రద్దు ప్రస్తావన
- చంద్రబాబు, లోకేశ్ లపై జగన్ విమర్శనాస్త్రాలు
- విద్యాసంస్కరణలను తుంగలో తొక్కుతున్నారని విమర్శలు
- ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారంటూ ట్వీట్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ ప్రభుత్వంపైనా, సీఎం చంద్రబాబు నాయుడు విధానాలపైనా రోజుకో అంశంపై విమర్శలు గుప్పిస్తున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. తాజాగా మరోసారి సుదీర్ఘ పోస్టు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లల్లో సీబీఎస్ఈ రద్దు విషయాన్ని ప్రస్తావిస్తూ వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. గవర్నమెంటు స్కూళ్లలో సీబీఎస్ఈ రద్దుతో మరోసారి పేదల వ్యతిరేకి అని నిరూపించుకున్నారంటూ చంద్రబాబును విమర్శించారు. చంద్రబాబు, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ తీసుకుంటున్న తిరోగమన నిర్ణయాలతో ప్రభుత్వస్కూళ్లు

7లో..

# చర్లపల్లికి న్యూ లుక్

## - స్టేషన్‌కు రహదారుల నిర్మాణం
## - సీఎం రేవంత్ కీలక ఆదేశం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ చర్లపల్లి కొత్తరూపు సంతరించుకోనుంది. నెల రోజుల్లోనే రూపు రేఖలు మారిపోనున్నాయి. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసారు. చర్లపల్లిలో కొత్త రైల్వే టెర్మినల్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే మూడు స్టేషన్లు ఉండగా.. వాటిపై రద్దీని తగ్గించేందుకు, జిల్లాలకు వెళ్లే రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం చర్లపల్లి రైల్వే టెర్మినల్ నిర్మించారు. అయితే ఈ స్టేషన్ రోడ్డు కనెక్టివిటీకి ప్రస్తుతం ఇబ్బందులు ఉండగా.. అవి త్వరలోనే తీరిపోనున్నాయి. రెండు రోడ్డు అభివృద్ధి ప్రణాళికలను(ఆర్‌డీపీ) జీహెచ్ఎంసీ రూపొందించింది. తాజాగా ఆ డీపీఆర్‌లను కమిషనర్ ఆమ్రపాలి సీఎం రేవంత్ దృష్టి తీసుకెళ్లారు. భూసేకరణకు అడ్డంకులు తొలగటం, వాటికి రేవంత్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో రోడ్ల నిర్మాణానికి వేగంగా అడుగులు పడ్డాయి. చర్లపల్లి రైల్వే స్టేషన్ ముందు మూడు ప్రధాన ద్వారాలను నిర్మించాలని జీహెచ్ఎంసీ ప్రణాళికలు రచిస్తోంది. 100 అడుగుల వెడల్పుతో రెండు, 80 అడుగుల రోడ్డుతో మరో ద్వారం నిర్మించనున్నారు. ఈ ద్వారాలను 100 అడుగుల రోడ్డుతో కనెక్ట్ చేయనున్నారు. ఈ రోడ్లను నెల రోజుల వ్యవధిలోనే నిర్మించాలని అధికారులకు సీఎం రేవంత్ తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఇక రోడ్డుకు సమీపంలో పార్కింగ్ కేంద్రాలు, బస్టాండు, ఆటో స్టాండ్‌ల నిర్మాణానికి ఓపెన్ ప్లేస్ కూడా వదిలేస్తారు. 100 అడుగుల రోడ్డు కోసం ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ 3 ఎకరాల భూమిని జీహెచ్ఎంసీకి ఇవ్వనుంది. ఇతర రోడ్లకు 6-7 ఎకరాల పరిశ్రమలశాఖ భూమిని ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. స్టేషన్ వెనకాలే కొన్ని నివాస సముదాయాలు ఉండగా వాటిని తొలగించి 80 అడుగుల రోడ్డు నిర్మించనున్నారు. మొత్తంగా రూ.35 కోట్ల అంచనా వ్యయంతో చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు కొత్త రోడ్లు నిర్మించనున్నారు. రోడ్లు పూర్తయ్యాక స్టేషన్ ముందు మరింత భూసేకరణ చేపట్టి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ మెరుగుపరిచేదుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఇక్కడున్న కొన్ని పరిశ్రమలు బయటకు వెళ్లాక మరో 200 ఎకరాల వరకు భూమి తెలంగాణ ప్రభుత్వానికి అందనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక ఎయిర్‌పోర్టును తలదన్నేలా చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. స్టేషన్‌లో మొత్తం 9 ఫ్లాట్‌ఫామ్‌లు, రెండు పెద్ద ఎఫ్‌వోబీలు, రిజర్వేషన్, టికెట్ కౌంటర్లు, ఆరు ఎస్కలేటర్లు, ఏసీ, నాన్‌ఏసీ విశ్రాంతి గదులు, ఫుడ్ కోర్టులు, విడిది కేంద్రాలతో స్టేషన్‌ను దాదాపు 100 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి కొత్త స్టేషన్ నగర ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఇప్పటికే అక్కడ 13 జతల ట్రైన్లు ఆగుతుండగా భవిష్యత్తులో మరో 45 జతల కొత్త ట్రైన్లు రాకపోకలు సాగించనున్నాయి.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్



**సైఫాబాద్ ( ప్రశ్న న్యూస్ )** తెలంగాణ పాలనా ప్రధాన కార్యాలయం డా. బీ.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు.
ఈ మేరకు ఆధునిక భారత నిర్మాత, సాంకేతిక విప్లవ ప్రదాత, మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులతో కలిసి 'తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పాల్గొన్నారు.

## గణేష్ నిమ్మజ్జనానికి తరలిరండి: శాంత్ కుమార్



**సుల్తాన్ బజార్ (ప్రశ్న న్యూస్)** వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సమయం అసన్నమవుతోంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలలో కొలువైన గణనాథులు గత 11 రోజుల పాటు పూజలను అందుకున్ని పదో రోజైన (అనంత చతుర్దశి) మంగళవారం నాడు నిమజ్జనంతో గంగమ్మ ఒడిలోకి చేరేందుకు సిద్ధమవుచున్నాడు. ఈ నేపధ్యంలో సుల్తాన్ బజార్ పరిధిలోని కృపారాంబాగ్ లో ప్రత్యేక మండపంలో కొలువైన బోజ్జ గణపయ్య నిమజ్జనానికి సర్వం సిద్ధం చేసామని శాంత్ కుమార్ తెలిపారు. భాద్రపద శుద్ద చవితి మొదలు అనంత చతుర్దశి వరకు ప్రతి రోజ ప్రత్యేక పూజలు అందుకున్న వినాయక విగ్రహాన్ని ఎంతో వైభవంగా, సంగీత వాయిద్యాలతో ఊరేగిస్తు గంగమ్మ ఒడికి చేర్చేందుకు సిద్దమవుచున్నాడని శాంత్ కుమార్ తెలిపారు. గత పది రోజులుగా మండప నిర్వాహణలో తమ శక్తి యుక్తులను ప్రదర్శించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శ్రమించిన వీనస్ సభ్యులకు,తమకు సహకరించిన భక్తులకు ధన్యవాధాలు తెలిపారు. అలాగే మంగళవారం నాడు నిర్వహించనున్న వినాయక నిమజ్జన శోభాయాత్రలో భక్తులు భారీగా పాల్గోనాలని కోరారు. నేడు పూజ కార్యక్రమాలను శశికాంత్ కుటుంబ సభ్యులు నిర్వహించగా చిద్విలాస్, అంబాదాస్, సందీప్, శివ, అభి, తన్మయ్, శ్రీకాంత్, మురళీ (లడ్డు), నితిన్, సూర్యనారాయణ, రమేష్, తదితరుల పాల్గోన్నారు.

# విధి ఎంత కఠినమైనది

## - గణేష్ లడ్డూ దక్కించుకున్న టెకీ
## - కాసేపటికే గుండెపోటుతో మృతి
## - హైదరాబాద్ మణికొండలో ఘటన

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గణేష్ నవరాత్రి ఉత్సవాల వేళ హైదరాబాద్ మణికొండ అల్కాపురి కాలనీలో విషాదం చోటు చేసుకుంది. వేలంలో లడ్డూ దక్కించుకున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. కాసేపటికే గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయాడు. రూ. 15 లక్షలకు వేలంలో గణేషుడి లడ్డూను సొంతం చేసుకొని ఉత్సాహంగా ఆడిపాడాడు. డీజే సౌండ్స్‌కు హుషారుగా నృత్యం చేశాడు. అనంతరం ఇంటికి వెళ్లి కూర్చున్నచోటే కుప్పకూలిపోయాడు. దీంతో అతడి కుటుంబంలో తీవ్ర విషాదం అలముకుంది. వివరాల్లోకి వెళితే మణికొండ అల్కపురి కాలనీలో నివాసముండే శ్యామ్ ప్రసాద్ ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నాడు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కాలనీలో మండపంలో వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. సెప్టెంబర్ 15న తొమ్మిదో రోజు నిమజ్జనం ఏర్పాట్లు చేశారు. వినాయకుడి చేతిలోని లడ్డూను వేలం వేయగా.. లడ్డూను దక్కించుకునేందుకు కాలనీ వాసులు పోటీపడ్డారు. వేలంలో పాల్గొన్న శ్యామ్ ప్రసాద్ ఏకంగా రూ. 15 లక్షలకు లడ్డూను దక్కించుకున్నాడు. ఆ ఆనందంలో శ్యామ్ ప్రసాద్ మండపం వద్దే హుషారుగా కాసేపు డ్యాన్స్ చేశాడు. డీజే సౌండ్స్‌కు కాలనీ వాసులతో కలిసి స్టెప్పులేశాడు. ఆడిపాడి ఎంజాయ్ చేసిన శ్యామ్.. లడ్డూను తీసుకొని ఇంటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నాడు. డ్యాన్స్ చేసి అలసిపోయిన అతడు సోఫాలో కాసేపు కూర్చుకున్నాడు. కాసేపటికే ఛాతీలో నొప్పి వస్తుందని.. కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. దీంతో అతడి కుటుంబంలో తీవ్ర విషాదం అలముకుంది. అప్పటి వరకు సరదాగా ఆడిపాడిన శ్యామ్ ఇలా ఉన్నట్లుండి ప్రాణాలు కోల్పోవటంతో కాలనీలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. వేలం పాటలో దేవుడి లడ్డూ దక్కించుకున్న శ్యామ్.. క్షణాల్లోనే ఆ దేవుడి దగ్గరికే వెళ్లిపోయాడంటూ స్థానికులు కన్నీరు పెట్టుకున్నారు. విధి ఎంత విచిత్రమైనదో అంటూ బోరున విలపించారు. అయితే ఇటీవల కాలంలో హార్ట్ ఎటాక్ మరణాలు ఎక్కువయ్యాయి. డీజే సౌండ్లు కూడా గుండె లయ తప్పటానికి కారణంగా నిపుణులు చెబుతున్నారు. భారీ శబ్దాలు హార్ట్ ఎటాక్‌లకు దారి తీస్తాయని..



మితిమీరిన డీజే సౌండ్లు మంచివి కావని చెబుతున్నారు.

## బొజ్జ రాజేశ్వర్ రెడ్డి ని సన్మానించిన తెలంగాణ న్యాయవాదులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ హై కోర్టు గవర్నమెంట్ ప్లీడర్ గా నియామకమైన బొజ్జ రాజేశ్వర్ రెడ్డి ని తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఘనంగా సన్మానించారు. గతంలో దాదాపు 14 సంవత్సరాల పాటు నాంపల్లి కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా, టీటీడీ బోర్డు న్యాయ సలహాదారుగా పని చేస్తూ న్యాయం కోసం నిలబడ్డ రాజేశ్వర్ రెడ్డి కి ఈ పదవి దక్కడం పై తెలంగాణ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.ఈ అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద సంఘ నాయకులు వొదయారపు రవికుమార్, జొన్నాడ రాకేష్ ,కొంగల శ్రీదర్, ప్రదీప్ కుమార్ , జరపుల విజయ నాయక్, అమరేందర్ రెడ్డి, శ్యాం గట్కు, అజయ్ కుమార్ తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొని ఘనంగా సన్మానించారు.

## గణనాధునికి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం







తార్నాక (ప్రశ్న న్యూస్) తార్నాక లోని విజయపురి కాలనీ యందు గణనాధుని వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం భారీ స్థాయిలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కోలాహలంగా చిన్నక్రాంతి కాలనీ వినాయక నిమజ్జనం



**మేడిపల్లి(ప్రశ్న న్యూస్)** నవరాత్రులు పూజలు అందుకున్న గణ నాథుడు ఆదివారం రాత్రి భక్తుల కోలాహలం మధ్య నిమజ్జనానికి తరలివెళ్లాడు.చెంగిచెర్ల చిన్నక్రాంతి కాలనీ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణ నాధుడు డీజే చప్పుళ్లతో, బ్యాండ్ మేళాలతో నిమజ్జనానికి తరలించారు.యువకుల డీజే నృత్యాలు,చిన్నారుల చిందులతో, మహిళల నృత్య ప్రదర్శనలతో అర్ధరాత్రి వరకు ఊరేగింపు నిర్వహించారు. యువకులు, చిన్నారులు 'గణపతి బప్పా మోరియా' అంటూ ఆనందంగా పరవశించిపోతూ రాంపల్లి చెరువుకు నిమజ్జనానికి తరలివెళ్లారు.వినాయక నిమజ్జన కార్యక్రమంలో కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించారు. ముందుగా గణేష్ లడ్డూ,కలశం వేలం వేయగా భక్తులు వేలంలో పాల్గొని వాటిని వారి సొంతం చేసుకున్నారు.వేలం పాటలో లడ్డును 1,26,000 వేల రూపాయలకు గంగపురం ఉమేష్ దక్కిచ్చుకోగా.. కలశం ను మేడ బాపురాజు 31,616 వేల రూపాయలకు కైవసం చేసుకున్నారు.అదేవిధంగా పలు క్రీడలలో పాల్గొని గెలుపొందిన వారికి నిమజ్జన కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న రాసాల కుమార్ యాదవ్, ఏర్పుల మహేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో తిరుపతి రాజు,నిలుగొండ వెంకటేష్ గౌడ్,కొండే వెంకటేష్ ,కొలుకులపల్లి శ్రీనివాస్, బాపిరాజు, విక్రమ్ గౌడ్, వీరమల్ల శివ పటేల్, సంజీవ్,రామరాజు,ఆర్ల ప్రవీణ్ ,ఉమేష్, రాజేందర్ రెడ్డి మల్గ మల్లేష్ కురుమ,సంతోష్ కుమార్, రాంరెడ్డి, శ్రీనివాస్ చారి, రవీందర్, నవీన్ రెడ్డి ,ప్రవీణ్ యాదవ్,మల్లేష్ కురుమ ,శ్రీధర్ యాదవ్, సతీష్, యకస్వామి కురుమ, బీసు నరేష్ గౌడ్, ఉమేష్, శివరాత్రి నరేష్,సంపత్, సతీష్,రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.







## గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న గౌడ సంఘం మండల అధ్యక్షుడు నాయిని వెంకట్ గౌడ్



**మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ )** కొల్చారం మండల పరిధిలోని అప్పాజీపల్లి జై దుర్గ భవాని గణేష్ మండలి సభ్యులు ఆధ్వర్యంలో జై దుర్గ భవాని గణేష్ మండలి ఘనంగా నిర్వహించి ఈ నిమర్జనానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న కొల్చారం మండలం గౌడ్ సంఘం అధ్యక్షులు నాయిని వెంకట్ గౌడ్ కొల్చారం ఎస్సై మహమ్మద్ గౌస్ ఈ సందర్భంగా గ్రామ ప్రజల సమక్షంలో లడ్డు వేలం పాట నిర్వహించి మొదటి లడ్డు వేలం పాటలో 25,000 వేల రూపాయలకు తిమ్మక్క పల్లి గోపాల్ తండ్రి రాములు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జై దుర్గా భవాని గణేష్ మండలి సభ్యులు లడ్డును అందజేసి వారిని శాలువతో ఘనంగా సత్కరించారు ఈ నిమజ్జన కార్యక్రమంలో గ్రామ ప్రజలు యువకులు యువజన నాయకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మీ ఆరోగ్యానికి వరం అవిసె గింజలు

- అధిక కొలెస్ట్రాల్, గుండె జబ్బులకు చెక్
- రోజు ఒక చెంచా తింటే ఎన్నో ఉపయోగాలు
- ప్రతిరోజు కచ్చితంగా తినండి ఆరోగ్యాన్ని పొందండి





ఉదయాన్నే ఖాళీ కడుపుతో అవిసె గింజలు నానబెట్టిన నీరు తాగుతున్నారా.? ఎన్నో ప్రయోజనాలు తప్పక తెలుసుకోండి. నిత్యం ఇది తీసుకోవడం వల్ల మీరు ఆరోగ్యవంతులుగా కావడం ఖాయం. అవిసె గింజలు అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. కీళ్లనొప్పులు, ఉబ్బసం, క్యాన్సర్, రక్తనాళాల వ్యాధులు, అధిక రక్తపోటు, హార్మోన్ల అసమతుల్యత, హృదయ సంబంధ వ్యాధులు, డైవర్టిక్యులర్ వ్యాధి, మరెన్నో అనారోగ్య సమస్యలు ఉన్నవారికి ఖాళీ కడుపుతో నానబెట్టిన అవిసె గింజల నీరు తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో తెలుసుకుందాం..ఒక గ్లాసు నీటిలో రాత్రి ఒక చెంచా నానబెట్టిన అవిసె గింజల నీటితో మీ రోజును ప్రారంభించడం వల్ల మీ శరీరంపై గొప్ప ప్రభావాలు ఉంటాయని మీకు తెలుసా.? ఇది ఉదయం టీ, కాఫీకి బదులు ప్రత్యామ్నాయం. అవిసె గింజలు కేలరీలు, పిండి పదార్థాలు, కొవ్వు, ఫైబర్, ప్రోటీన్, థయామిన్, రాగి, మాంగనీస్, మెగ్నీషియం, భాస్వరం, సెలీనియం, జింక్, విటమిన్ బి6, ఐరన్, ఫోలేట్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు వంటి పోషకాలకు గొప్ప మూలం. అవిసె గింజలు అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. కీళ్లనొప్పులు, ఉబ్బసం, క్యాన్సర్, రక్తనాళాల వ్యాధులు, అధిక రక్తపోటు, హార్మోన్ల అసమతుల్యత, హృదయ సంబంధ వ్యాధులు, డైవర్టిక్యులర్ వ్యాధి, మరెన్నో అనారోగ్య సమస్యలు ఉన్నవారికి ఖాళీ కడుపుతో నానబెట్టిన అవిసె గింజల నీరు తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అన్ని ఇన్ని కావు. పీచుతో కూడిన అవిసె గింజలు నానబెట్టిన నీటిని ఉదయం ఖాళీ కడుపుతో తాగడం వల్ల మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంతోపాటు జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మీ జీర్ణక్రియలో మీకు సమస్యలు ఉంటే ఖాళీ కడుపుతో అవిసె గింజల నీటిని తాగడం ప్రారంభించండి. ఇది పేగు సమస్యలను అధిగమించడంలో మీ శరీరానికి సహాయపడుతుంది. అవిసె గింజలు భేదిమందుగా పనిచేస్తాయి. మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో సహాయపడతాయి ఎందుకంటే వాటిలో ఫైబర్, లిగ్నాన్స్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు పుష్కలంగా ఉంటాయి. ఇది శక్తివంతమైన



యాంటీఆక్సిడెంట్. అదనంగా, ఇది అతిసారం, మలబద్ధకంతో సహా తీవ్రమైన అనారోగ్యాల చికిత్సలో సహాయపడుతుంది. నానబెట్టిన ఫ్లాక్స్ సీడ్ వాటర్ ఆరోగ్యకరమైన జుట్టును ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. ఎందుకంటే ఇందులో విటమిన్ ఇ, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ , బి విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇది ఫ్రీ రాడికల్స్ ఏర్పడటాన్ని తగ్గించడం ద్వారా కొత్త జుట్టు పెరుగుదలను ప్రేరేపించడంలో సహాయపడుతుంది.అవిసె గింజలు చర్మాన్ని అవసరమైన పోషకాలతో నింపుతాయి. మీకు ప్రకాశవంతమైన, ఆరోగ్యకరమైన చర్మాన్ని అందిస్తాయి. వాటిలో మంచి కొవ్వులు, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, ప్రోటీన్, లిగ్నన్స్, అవసరమైన కొవ్వు ఆమ్లం ఉంటాయి. అదనంగా ఇది చర్మం చికాకును తగ్గించడంలో, మొటిమలు కలిగించే ఆండ్రోజెన్ హార్మోన్ల ఉత్పత్తిని నియంత్రించడంలో సహాయపడుతుంది. హై బ్లడ్ షుగర్ లెవెల్స్ నిర్వహించడంలో సహాయపడుతుంది. డైటరీ ఫైబర్ అధికంగా ఉండే ఫ్లాక్స్ సీడ్స్ ఇన్సులిన్, బ్లడ్ షుగర్ లెవెల్స్ ను బ్యాలెన్స్ చేయడం ద్వారా మధుమేహాన్ని నివారించడంలో సహాయపడతాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది, గుండె జబ్బులు రాకుండా అరికాడుతుంది. ఫ్లాక్స్ సీడ్స్ నీటిలో డైటరీ ఫైబర్‌లు సాధారణ ప్రేగు కదలికలు, మల విసర్జన, ప్లాస్మా టోటల్, ఎల్ డి ఎల్ కొలెస్ట్రాల్ తగ్గడం, మెరుగైన కొవ్వు విసర్జనను ప్రోత్సహిస్తుంది. ఇది కొలెస్ట్రాల్, అన్ని కొవ్వుల శోషణను తగ్గిస్తుంది. చివరికి తక్కువ కొలెస్ట్రాల్ ఏర్పడుతుంది. ఖాళీ కడుపుతో అవిసె గింజల నీటిని తాగడం వల్ల మీ కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉంటే తగ్గుతాయి. క్యాన్సర్ రాకుండా సహాయపడుతుంది. అవిసె గింజలు శరీరంలోని ఈస్ట్రోజెన్‌ల జీవక్రియను మార్చడం ద్వారా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల చికిత్సలో సహాయపడే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. బరువు తగ్గడంలో కూడా సహాయపడుతుంది. మీరు కొన్ని అదనపు పౌండ్లను కోల్పోవాలని ప్రయత్నిస్తున్నట్లయితే అవిసె గింజల నీరు మీ కోసం అద్భుతాలు చేస్తుంది. రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఉంచితే కాస్త ఉబ్బి, ఉదయం తింటే కడుపు నిండుతుంది. మీరు వాటిని తిన్నప్పుడు మీరు మరింత సంతృప్తి చెందుతారు. ఫైబర్ అధికంగా కలిగి ఉన్న అవిసెగింజల నీటిని తాగటం వల్ల ఆకలిని తగ్గించడంలో, బరువు తగ్గించడంలో సహాయపడతాయి. ఇటీవల కాలంలో అవిసె నూనెతో తయారు చేసే టాబ్లెట్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. కాబట్టి మంచి కంపెనీకి సంబంధించిన వాటిని రోజుకు ఒకటి లేదా రెండు చొప్పున యువకులు, పెద్దలు తీసుకుంటే అనేక ప్రయోజనాలతో పాటు మంచి ఆరోగ్యం లభిస్తుంది.

సుదర్శన్ ముదిరాజ్
వన మౌలక వైద్యులు
జటానంద స్వామి ఆశ్రమం
మదనపల్లి, శంషాబాద్
ఫోన్ నెంబర్:9703334525

## నిల్వ వుంచిన మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు

### - మునిసిపల్ కమిషనర్ సుడిగాలి పర్యటన

**జంగారెడ్డిగూడెం** ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణంలో మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్ సుడిగాలి పర్యటన చేసారు. పట్టణం లోని పలు చికెన్, మటన్ దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు చేసారు. ఒక దుకాణంలో నిల్వ ఉంచిన మాంసాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. సుమారు 25 కేజీల మాంసాన్ని దంపింగ్ యార్డ్ కు తరలించారు. నిల్వ ఉంచిన చికెన్ ,మటన్ మాంసాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అయన హెచ్చరించారు.

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

### - బాణాసంచా పేలి పలువురికి గాయాలు

**మనుబోలు** నెల్లూరు జిల్లా మనుబోలు గ్రామం బీసీ కాలని లో వినాయక నిమజ్జనం సందర్భంగా అపశృతి చోటుచేసుకుంది బాణాసంచా పేలి సుమారు 20 మందికి పైగా గ్రామస్తులు తీవ్ర గాయాలు పాలయ్యారు, గాయాలైన వారిలో నలుగురికి పైగా పిల్లలు వున్నారు.
మనుబోలు గ్రామం బిసి కాలనీ లో వినాయక నిమజ్జనం ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు భారీ ఎత్తున బాణాసంచా పేల్చుతూ ఉత్సవాలు జరుపుకుంటున్నారు,బాణాసంచా పేల్చే క్రమంలో పొరపాటున బాణాసంచా నిల్వ ఉంచిన ప్రాంతంలో నిప్పురవ్వ పడడంతో ఒక్కసారిగా భారీ స్థాయిలో పేలుడు సంభవించింది ఈ పేలుడు దాటికి చుట్టుపక్కల ఉన్న 20 మందికి పైగా గ్రామస్తులు తీవ్ర గాయాలు పాలయ్యారు, వీరిలో ముఖ్యంగా పిల్లలు నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి, వీరిలో ఒకరికి కన్ను దెబ్బ తినడం ,మరొకరి చేతికి తీవ్ర గాయాలు అవ్వడం మరి కొందరికి శరీరంపై తీవ్ర గాయాలు అవడంతో క్షతగాత్రులను హుటాహుటిన గూడూరు ప్రభుత్వాసుపత్రికి కొందరిని, నెల్లూరు జిల్లా ఆసుపత్రికి మరికొందరిని,నెల్లూరు లో ప్రైవేట్ ఆస్పత్రికి కొందరిని తరలించారు వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం...

## అమలాపురంలో ఓ ఇంట్లో పేలిన గ్యాస్ సిలిండర్

### - ఏడుగురికి తీవ్ర గాయాలు

**అమలాపురం** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణం రావులచెరువులో గ్యాస్ సిలిండర్ పేలింది. ఘటనలో 14 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఇంట్లో ఉన్న ఏడుగురికి తీవ్ర గాయాలు కావడంతో ఆమలాపురం ఏరియా ఆసుపత్రి కి తరలించారు. గ్యాస్ పేలుడు ధాటికి ఇల్లు తునా తునక లైంది. ఇంట్లో దీపావళి మందు గుండు సామాగ్రి పటాస్ మందు వండడంతో ప్రమాదం భారీ స్థాయిలో జరిగిందని స్థానికులు అంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే అయితబత్తుల ఆనందరావు, అమలాపురం పట్టణ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సమీక్షించారు.

## ముంపు ప్రాంతాలలో మంత్రి నారాయణ పర్యటన

**విజయవాడ** వరద ముంపు ప్రభావం పడిన ప్రాంతాల్లో చివరి మైలు వరకు న్యాయం చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి బాధితు నికీ అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి నారాయణ అన్నా రు.

పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా నష్టం వివరాల నమోదుతో నివేదికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ముం పు ప్రభావం పడిన ప్రతి ఇంటినీ సందర్శించి, నష్టం నమోదు చేసిన ట్లు తెలిపారు.

## దళిత బంధు రెండవ విడత నిధుల కోసం అర్ధనగ్న ప్రదర్శన

**జమ్మికుంట** దళితబంధు సాధన సమితి హుజురాబాద్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో దళితబంధు రెండవ విడత నిధులు మంజూరు చేయాలని జమ్మికుంట స్థానిక గాంధీ చౌరస్తాలో అర్ధనగ్న ప్రదర్శన చేసిన బాధితులు, ఇప్పటికే దళిత బంధు విడుదల చేయాలని అనేక కార్యక్రమలు చేసిన ప్రభుత్వం స్పందించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళితుల పట్ల వివక్షత చూపుతున్నాడని, దళితులు ఆర్థికంగా ఎదగడం ముఖ్యమంత్రి కి ఇష్టంలేనట్టు వ్యవహరిస్తున్నాడని,ఈ వైఖరి మార్చుకోకపోతే దళితుల ఉగ్రరూపం చూడాల్సివస్తుందని సాధన సమితి సభ్యులు అన్నారు. దళితబంధు పథకంలో వాహనాల స్కీం పెట్టుకున్న వారికీ పూర్తిస్థాయిలో 10లక్షలు మంజూరు చేసినట్లు షాపుల స్కీం పెట్టుకున్న వారికీ కూడా మిగతా 5 లక్షలు మంజురు చేసి దళితుల అభ్యున్నతికి తోడ్పడాలని లేని పక్షంలో
దళితులము అంత ఏకమై హైదరాబాద్ నడిబోడ్డున వెలసంఖ్యలో వచ్చి దళితుల సత్తా ఏంటో ఈ ప్రభుత్వానికి తెలిసేలా చేస్తామని మండిపడ్డారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి సర్పంచ్ ఎన్నికల లోపు దళిత బంధు రెండవ విడత నిధులు మంజూరు చేసేవిదంగా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి సభ్యులు కోలుగూరి సురేష్, కోలుగూరి నరేష్, అకినపల్లి ఆకాష్, ఇనుగాల బిక్షపతి, కోడెపాక రక్షిత్,గాజుల కూమర్,మహంకాళి రమేష్,రామంచ శ్రీకాంత్, పాత రాజేష్, ప్రవీణ్, సరిత,అరుణ, సుమారు 200 మంది బాధితులు పాల్గొన్నారు..


## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును పంపిణి చేసిన ఎమ్మెల్యే బి వి జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు నందవరం మండలం గురజాల గ్రామానికి చెందిన మంగలి నరేష్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని నిమ్స్ నా హాస్పిటల్ యందు చికిత్స పొందాడు. . చికిత్స కొరకు వారి దగ్గర స్థోమత లేకపోవడంతో ఎమ్మిగనూరు నియోజకవర్గ శాసన సభ్యులు బి వి జయనాగేశ్వర రెడ్డి ని సంప్రదించారు. స్పందించి మంగలి నరేష్ కి ఆర్థిక సాయం అందించవలసినదిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సీఎంఆర్ఎఫ్ ఈ ద్వారా దరఖాస్తు చేయడం జరిగినది. సోమవారం నాడు మంగలి నరేష్ కకు రెండు లక్షలు రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరవడంతో సదరు చెక్కును వ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి వి జయనాగేశ్వర రెడ్డి అందించారు.

## దేశంలో సామాజిక వివక్షతను, బ్రాహ్మణుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా తన జీవితకాలం మొత్తం పోరాన మహనీయుడు మన పెరియార్ రామస్వామి

### - నేడు ఆయన జయంతి

భారతీయ సమాజంలో కుల వ్యవస్థ నరనరాల్లో జీర్ణించుకొని అన్ని రంగాల్లో అసమానతలు పెరగడానికి కారణమైంది. ఈ అసమానతలను రూపుమాపడానికి సాహు మహరాజ్, నారాయణ గురు, రామస్వామి పెరియర్ వంటి సామాజిక విప్లవవీరులు చేసిన త్యాగఫలితంగా భారతదేశం స్వేచ్ఛా, సమానత్వం, సామాజిక, ఆర్థిక, రాజకీయాలు పునాదులుగా ఏర్పడిన భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూనే సమసమాజ నిర్మాణానికి దోహదం చేశారు. దక్షిణ భారతదేశ ప్రజలచే ముఖ్యంగా తమిళనాడు ప్రజలచే పెరియర్‌గా తాన్ తై పెరియర్‌గా ఆత్మీయంగా పిలవబడే ఈరోడ్ వెంకట రామస్వామి 1879లో ఈరోడ్‌లో ఇదే రోజు జన్మించారు. సంఘ సంస్కర్తగా, హేతువాదిగా, ఆత్మగౌరవ ఉద్యమ నిర్మాతగా ద్రావిడ ఉద్యమ సారథిగా ఆయన చేసిన సేవలకు గుర్తుగా ప్రజలు ఆయనను పెరియర్‌గా పిలుచుకునేవారు. 'పెరియర్' అంటే 'పెద్ద మనిషి' అని అర్థం. సమాజంలో ఆయన కుల, మత, వర్గ ఆధిపత్యాలపై తిరుగుబాటు చేశాడు. కుల, మత రహిత సమసమాజం కావాలని ఆయన ఆకాంక్ష. కానీ నిన్నగాక మొన్న పరువు హత్యలు ఈ దేశంలో జరిగిన తరుణంలో పెరియర్ జయంతిని నిర్వహించుకుంటున్నామంటే ఆయన ఆకాంక్ష ఇంకా అలాగే ఉంది. మహిళలకు సమాన హక్కులు కావాలని ఆయన కాంక్షించారు. పెరియర్ ముఖ్యంగా సమాజంలో ప్రధానంగా నెలకొని ఉన్న బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ప్రశ్నించారు. దక్షిణ భారతానికి చెందిన ద్రావిడులపై ఉత్తరానికి చెందిన బ్రాహ్మణ ఆధిపత్యాన్ని సహించేది లేదని స్వీయభావన ఉద్యమాన్ని నిర్మించారు. అగ్రవర్ణాలు తమ ఆధిప త్యాన్ని కొనసాగిం చడం కోసమే ఈ దేవుండ్లు, గుడులు, గోపురాలను నిర్మి స్తూ పనికిమాలిన పురాణా లను సృష్టించారని ప్రచారో ధ్యమాన్ని సాగించడం ద్వారా ఆయన ప్రముఖ హేతువాదిగా పేరు పొందారు. హేతువాదం, ఆత్మగౌరవం, స్త్రీ హక్కులు, కుల నిర్మూలన కోసం పెరియర్ చేసిన పోరాటం అప్పటికీ, ఇప్పటికీ ఒక చరిత్రగా మిగిలిపోతుంది. మూల-ద్రావిడ వాసులైన బ్రాహ్మణేతరులను, భార తదేశానికి చెందిన బ్రాహ్మ ణులు దోపిడీ చేయడాన్ని అణివేయడాన్ని వ్యతిరేకించారు. తమిళ సమాజాన్ని విప్లవ మార్గంలో నడిపి కుల వివక్షతను తొలగిం చడానికి తీవ్రంగా కృషి చేసిన వ్యక్తిగా తమిళ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి పెరియర్ రామస్వామి. అందుకే ఆయ నను ఆధునిక కాల ప్రవ క్తగా, ఆగేయ ఆసియా సోక్రటిస్‌గా, సామాజిక విప్లవ పితామహుడిగా, అజ్ఞానం, అంధ విశ్వాసాలు, అసంబద్ధమైన అచిర వ్యవహారాల ను వ్యతిరేకించే వారిగా యునెస్కో అభివర్ణించింది. "దేవుడు లేదు, దేవుడు లేదూ, అసలు దేవుడే లేడు" అనే నినాదంతో పెరియర్ సాగించిన ఉద్యమం ప్రధానమైనది, కుల, మత వ్యత్యాసాలు కలిగిన భారతదేశం తనకు వద్దని, కుల, మత రహితమైన భారతమే తనకు కావాలని పోరాటం చేశాడు. కుల, మతాలను రాజ్యాంగం నిషేధించినప్పుడే కుల, మత రహిత స మాజం ఏర్పడుతుందని ఆయన వాధించాడు. హిందుత్వ వాదాన్ని గట్టిగా వ్యతిరేకించారు. కాబట్టే వారికి పెరియర్ అంటే గిట్ట డం లేదు. పెరియర్ తన ఆశయాల సాధన కోసం 1939లో జస్టిస్ పార్టీ పెట్టారు. 1944లో జస్టిస్ పార్టీని 'ద్రావిడ్ దార్ కళనంగా' మార్చారు. ఈ పార్టీ సామాజికోద్యమానికే ప్రాధాన్యతని చ్చి ఎన్నికలకు దూరంగా ఉండి మరీ పోరాటం చేసింది. అంట రానితనం, కులం, వర్ణ వివక్షత తీవ్రంగా ఉన్న దేశంలో ప్రజల తో ఆత్మగౌరవాన్ని పెంపొందించడం, వారి మధ్య ఉన్న సా మాజి క ఆర్థిక సమానత్వాన్ని సాధించడం కుల వ్యవస్థను దోపిడీ మ యమైన సాంప్రదాయాలను నిర్మూలించడమే పెరియర్ ధ్యేయం.




హిందూ మతం ఆపాదించిన తరతరాల బానిసత్వాన్ని వదిలించుకునేందుకు దేవుడు ఒక్కడే, మనుషులంతా ఒక్కటే అని చాటడం మంచిదని ప్రభోధించాడు. ఎప్పుడు ఆయన భావాలు, ఆలోచనలు విప్లవాత్మకమైనవిగానే ఉండేవి. దేశం కుల, మత కంపులో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో మత దురహంకారాన్ని వ్యతిరేకిస్తూ శాస్త్రీయ, హేతుబద్ధమైన జీవన విధానాన్ని అవలంభించిన రోజు ఈ రోజు. ఆత్మగౌరవ పోరాటాలు చేసిన దళితులు, స్త్రీలు, బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని ధారపోసి, తన చివరి శ్వాస వరకు సమసమాజం కోసం పోరాటం చేసిన సామాజిక విప్లవకారుడు పెరియర్ రామస్వామి.

# నేడు తెలంగాణ విమోచన దినోత్సవం

### - నిజాం నవాబు తోకముడిచి భారత్‌కు లొంగిపోయిన రోజు
### - తెలంగాణ ప్రజలకు తెలంగాణ విమోచన దినోత్సవ శుభాకాంక్షలు

అది పరాయి పాలన నుంచి విముక్తి పొందిన దినం సొంతగడ్డపైనే పరాయివారిగా బతుకులీడుస్తున్న ప్రజలు జరిపిన యుద్ధం భూస్వాముల దౌర్జన్యాలు, నిజాం రాజరిక దుర్మార్గ వ్యవస్థ, రజాకర్ల అమానుషాలు తెలంగాణను అణువణువునా పట్టిపీడించిన అన్ని దుర్మార్గాల నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి పొందడానికి జరిగిన మహా సంగ్రామమది భారతదేశంలో హైదరాబాద్ సంస్థాన విలీనం చరిత్రాత్మకమైన ఉదంతం నిజాం నవాబు తోకముడిచి భారత్‌కు లొంగిపోయిన సందర్భం అసలు సెప్టెంబర్ 17న ఏం జరిగింది? హైదరాబాద్ సంస్థానం భారత్‌లో ఎలా విలీనమైంది? ఓసారి గుర్తు చేసుకుందాం. నిజాం కబంధ హస్తాల నుండి హైదరబాదు సంస్థానం విముక్తిపొందిన రోజును తెలంగాణ విమోచన లేదా విలీన దినం గా పాటిస్తారు. 1947 ఆగస్టు 15న బ్రిటిష్ వారి పాలన అంతమై భారతదేశమంతటా స్వాతంత్ర్య సంబరాలు జరుపుకున్నారు.. కానీ దేశం నడి బొడ్డున ఉన్న హైదరాబాద్ సంస్థాన ప్రజలకు ఆ అదృష్టం లేకుండా పోయింది. అప్పటి వరకూ బ్రిటిష్ వారికి సామంతుడిగా ఉన్న హైదరాబాద్ నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ తాను కూడా స్వతంత్రుడిని అయ్యానని ప్రకటించుకున్నాడు. హైదరాబాద్ అటు ఇండియాలో, ఇటు పాకిస్తాన్లో కలవదని స్వతంత్రంగా ఉంటుందని ప్రకటించాడు. కానీ సంస్థానంలోని ప్రజలు తాము భారతదేశంలో కలవాలని కోరుకున్నారు. ఆనాటి హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణ, మరాఠ్వాడా, కర్ణాటక ప్రాంతాల్లో ఇంకా ఫ్యూడల్ పాలన కొనసాగుతోంది. ఒకవైపు దేశ్ముఖ్, జాగీర్దార్, దొరల వెట్టి చాకిరిలో గ్రామీణ ప్రజానీకం మగ్గిపోతుంటే, మరోవైపు నిజాం అండతో రజాకార్లు చెలరేగిపోయారు.. ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. గ్రామాలపై పడి ప్రజలను దోచుకొని, హత్యాకాండను కొనసాగించారు. నిజాం ప్రోద్బలంతో రజాకార్ల నాయకుడు కాశీం రజ్వీ ఢిల్లీ ఎర్రకోటపై అసఫ్ జాహీ పతాకాన్ని గురేస్తానని విర్ర వీగాడు.. ఇలాంటి పరిస్థితిలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా స్టేట్ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ, ఆర్యసమాజ్ తమ తమ మార్గాల్లో పోరాటాన్ని చేపట్టాయి. ఈ సంస్థలన్నింటినీ నిషేధించాడు ఉస్మాన్ అలీఖాన్. భారత దేశ నడిబొడ్డున క్యాన్సర్ కంతిలా మారిన హైదరాబాద్ సంస్థానంపై చర్య తీసుకోక తప్పదని నాటి హోం మంత్రి, సర్దార్ వల్లభాయి పటేల్ నిర్ణయించుకున్నారు.. పరిస్థితిని ముందే ఊహించిన నిజాం నవాబు పాకిస్తాన్ సాయం కోసం వర్తమానం పంపడంతో పాటు,



ఐక్యరాజ్య సమితిని ఆశ్రయించాడు.. ఈ పరిణామాల నేపథ్యంలో 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం ఆపరేషన్ పోలో పేరిట హైదరాబాద్ సంస్థానాన్ని ముట్టడించింది. దీనికి పోలీస్ యాక్షన్ అనే పేరు పెట్టారు. ఆ తర్వాత సెప్టెంబర్ 17న నిజాం నవాబు లొంగుబాటు ప్రకటన చేశారు. ఈ విధంగా హైదరాబాద్ వాసులకు స్వాతంత్ర్యం వచ్చింది. హైదరాబాదు రాష్ట్రం ఏర్పడింది. అందుకే సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా పాటిస్తారు.

## వరద బాధితుల సహాయార్థం 10 లక్షల రూపాయల విరాళాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేసిన సుప్రీమ్ హీరో సాయి దుర్గతేజ్



తెలంగాణలో భారీ వర్షాలు, వరదలతో ఎంతోమంది ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వరదల వల్ల ఆస్తి, ప్రాణనష్టం సంభవించింది. వరద బాధిత ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి అండగా నిలబడ్డారు సుప్రీమ్ హీరో సాయి దుర్గతేజ్. తన వంతు సహాయంగా 10 లక్షల రూపాయలు తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ప్రకటించారు. ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని హైదరాబాద్ జుబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో కలిసి 10 లక్షల రూపాయల డొనేషన్ చెక్ అందించారు సాయి దుర్గతేజ్. ఈ సందర్భంగా వరద సహాయ చర్యలపై ముఖ్యమంత్రిని అడిగి తెలుసుకున్నారు సాయి దుర్గతేజ్. రేవంత్ రెడ్డి గారిని కలిసి మాట్లాడటం పట్ల తన సంతృప్తిని, సంతోషాన్ని వ్యక్తం చేశారు సాయి దుర్గతేజ్.తెలంగాణతో పాటు ఏపీలోనూ వరద బాధితుల సహాయార్థం 10 లక్షల రూపాయల విరాళాన్ని ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్ కు ప్రకటించి, ఆ మొత్తాన్ని మంత్రి లోకేష్ గారికి రీసెంట్ గా అందజేశారు సాయి దుర్గతేజ్. అలాగే విజయవాడలోని అమ్మ అనాథాశ్రమాన్ని స్వయంగా సందర్శించి, వారి బాగోగులు తెలుసుకున్నారు. అమ్మ ఆశ్రమానికి 2 లక్షల రూపాయలు, ఇతర సేవా సంస్థలకు 3 లక్షల రూపాయల విరాళం అందించారు. సమాజం పట్ల, ఇబ్బందుల్లో ఉన్న ప్రజల పట్ల పెద్ద మనసుతో స్పందిస్తున్న సాయి దుర్గతేజ్ సేవా గుణానికి, మంచి మనసుకు ప్రతి ఒక్కరి ప్రశంసలు దక్కుతున్నాయి.

# ఈ రహదారుల్లో ప్రయాణించేయాలంటే నరకయాతనే

**- గుంతల మయమైన ప్రధాన రహదారులు.... - పట్టించుకోని అధికారులు పాలకులు.....**



**రుద్రవరం (ప్రశ్న న్యూస్):** మండలంలోని ఆర్ అండ్ బి ప్రధాన ప్రయాణం చేయాలంటే నరకయాతన అనుభవించాల్సిందేనని ప్రజలు వాపోతున్నారు. గుంతల మయమైన ఆర్ అండ్ బి ప్రధాన రహదారులను అటు అధికారులు గానీ ఇటు పాలకులు గాని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని చిన్నకంబలూరు మెట్ట నుండి సిరివెళ్ల మార్గమధ్యంలోని ఆర్ అండ్ బి ప్రధాన రహదారి అలాగే రుద్రవరం నుండి నరసాపురం మార్గమధ్యంలోని ఆర్ అండ్ బి ప్రధాన రహదారి, గుర్రప్పని మాను మెట్ట నుండి చందలూరు వరకు ఆర్ అండ్ బి రహదారి నరకానికి ఆనవాళ్లుగా తలపిస్తున్నాయి. ఈ ప్రధాన రహదారుల్లో ప్రయాణం సాగించాలంటే నరకయాతన అనుభవిస్తున్నామని వాహనదారులు ప్రయాణికులు ప్రజలు వాపోతున్నారు. ఈ ఆర్ అండ్ బి ప్రధాన రహదారుల్లో నిత్యం వాహనాల రాకపోకలు సాగించాల్సిందే. వాహనదారులు ప్రయాణికులు ప్రజలు నిత్యం ఈ రహదారుల్లో ప్రయాణం చేయాల్సి ఉంది గుంతల మయమై రహదారులు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు ప్రయాణికులు ప్రజలు ప్రయాణం సాగించే సందర్భంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మండల పరిధిలోని గురుప్పని మాను మెట్ట నుండి చందలూరు వరకు ఆర్ అండ్ బి బీటీ రోడ్డు అధ్వానంగా తయారైంది. నాగిరెడ్డిపల్లె మెట్ట నుండి పేరూరు వరకు ఉన్న మట్టి రోడ్డు గుంతల మయమై అధ్వానంగా ఉండడంతో పేరూరు గ్రామం నుండి మండల కేంద్రమైన రుద్రవరం గ్రామం చేరుకోవాలన?నా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేరూరు నాగిరెడ్డిపల్లి గ్రామస్తులు వాపోతున్నారు. రుద్రవరం నుండి ఆళ్లగడ్డకు పనుల నిమిత్తం వెళ్లాలన్న గుంతల మయమైన ప్రధాన రహదారిలో ప్రయాణం సాగించాలంటే నరకయాతన అనుభవిస్తున్నామని ప్రయాణికులు ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన రుద్రవరం నుండి చిన్నకంబలూరు సిరివెళ్ల మార్గమధ్యంలోని అలాగే రుద్రవరం నుండి నరసాపురం మార్గమధ్యంలోని ఆర్ అండ్ బి ప్రధాన రహదారిలో కంకర తేలి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారుల్లో ప్రయాణాలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాహనదారులు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాల పరిధిలోని రైతులు రైతు కూలీలు పంట పొలాలకు వెళ్లాలంటే అధ్వానంగా గుంతలు ఏర్పడ్డ రహదారుల్లో ప్రయాణం సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మా ఇబ్బందులు సంబంధిత అధికారులకు కనిపించవా అని అధికారులను ఆ గ్రామాల రైతులు రైతు కూలీలు ప్రశ్నిస్తున్నారు.

ఈ ఆర్ అండ్ బి ప్రధాన రహదారులు దెబ్బతిని పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్న అటు పాలకులు గాని ఇటు సంబంధిత అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదని ప్రయాణికులు వాహనదారులు ఆయా గ్రామాల రైతులు ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో వర్షాలు పడినప్పుడు రహదారుల్లో ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలువ చేరి రహదారులు సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయని, పలు సందర్భాల్లో కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారని ఈ రహదారిలో ఇంత భయంకరమైన సంఘటనలు చోటు చేసుకుంటున్నా రహదారుల మరమ్మతులు చేపట్టాల్సిన సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్నారని వాహనదారులు ప్రయాణికులు ఆయా గ్రామాల రైతులు ప్రజలు ఆరోపిస్తున్నారు. గుంతలు ఏర్పడిన రహదారుల్లో ప్రయాణం సాగించి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా పాలకులకు గానీ అధికారులకు కానీ చీమకుట్టినట్లైనా అనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఆర్ అండ్ బి ప్రధాన రహదారుల్లో నిత్యం రాకపోకలు సాగుతూ ఉంటాయని పలు సందర్భాలలో పాలకులు అలాగే జిల్లా అధికారులు ప్రయాణం సాగిస్తూ ఉన్నారని వారు కూడా ఈ రహదారులను చూసి చూడనట్లే వెళ్ళిపోతున్నారు తప్ప ఈ రహదారులపై దృష్టి సారించి అద్వానంగా ఉన్న రహదారుల మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అంతరాయం జరగకుండా ప్రమాదాలు చోటు చేసుకోకుండా చేపట్టాలన్న ఆలోచన వారికి తట్టిందో లేదో అర్థం గాని ప్రశ్నలుగా నిలుస్తున్నాయి.

మండలంలో పలు సందర్భాలలో సమావేశాలు సభలు నిర్వహించిన సందర్భాలలో పాలకులు ఈ రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులు చేపడతారని మాటలు చెబుతున్నారే తప్పా సంవత్సరాలు గడుస్తున్నా పాలకులు చెప్పే మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయే తప్ప రహదారుల మరమ్మతులు చేపట్టే నాధుడే కరువయ్యాడన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అటు పాలకులు గానీ ఇటు సంబంధిత అధికారులు కానీ స్పందించి గుంతలు ఏర్పడి అద్వానంగా ఉన్న ఆర్ అండ్ బి ప్రధాన రహదారుల మరమ్మతులు చేపట్టాలని వాహనాల రాకపోకలకు ప్రయాణికులకు ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రమాదాలు జరగకుండా ప్రాణాలు కాపాడేలా రోడ్ల మరమ్మత్తుల పనులు తక్షణమే చేపట్టాలని వాహనదారులు ప్రయాణికులు ఆయా గ్రామాల రైతులు రైతు కూలీలు ప్రజలు కోరుతున్నారు.

# మన్యం ధీరుడు

## చిత్రం విజయవంతం కావాలి

**- ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్**

**- ఈనెల 20న ప్రపంచ వ్యాప్తంగా విడుదల**




**విశాఖపట్నంం(ప్రశ్న న్యూస్)** ఈనెల 20వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్న 'మన్యం ధీరుడు' చిత్రం విజయవంతం కావాలని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. అల్లూరి సీతారామరాజు జీవిత కథతో ఆర.వి.వి.సత్యనారాయణ తెరకెక్కించిన మన్యం ధీరుడు చిత్రం విడుదల నేపథ్యంలో నగరంలోని అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ .. ప్రతి ఒక్కరూ ముఖ్యంగా పిల్లలు, యువత ఈ చిత్రాన్ని చూడాలని పిలుపునిచ్చారు. ఈ రోజుల్లో సినిమా తీయాలంటే ఒక సాహసమని.. అటువంటిది ఆర్ వి వి సత్యనారాయణ హీరోగా, దర్శకుడుగా, గాయకుడిగా ఈ చిత్రంలో విభిన్న పాత్రలు పోషించారన్నారు. ఆయన ఆహార్యం కూడా అల్లూరి సీతారామరాజు పాత్రకు సరిగ్గా సరిపోయిందన్నారు. మన్యం ధీరుడు ట్రైలర్ అద్భుతంగా ఉందని.. సినిమా కూడా అద్భుత విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ కు అభినందనలు తెలియజేశారు.

# లక్ష్మీ గణపతి ఆలయంవద్ద భారీ అన్న సమారాధన



**తాడేపల్లిగూడెం :** తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను లక్ష్మీ గణపతి ఆలయం వద్ద గణపతి నవరాత్రి మహోత్సవంలో భాగంగా సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆరుగొలను కొత్తూరు ప్రత్తిపాడు గ్రామాల నుంచి భారీగా భక్తులను సమారాధనలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త గోపిరెడ్డి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నూకల బుల్లయ్య అడ్డగర్ల ఏడుకొండలు, కోన సూర్యనారాయణ ఫొటోస్, తోట నాగేశ్వరరావు, కొడవల్లి సూర్యనారాయణ, గోపిరెడ్డి రాంబాబు, బత్తిరెడ్డి ఏడుకొండలు, అడ్డగర్ల రాముడు తదితరులు పాల్గొన్నారు.

# నా ఇంటికి వచ్చావ్

## నన్ను పీసీసీ చీఫ్ చేయమని నా కాళ్లు మొక్కినవ్..

**- ఆరు హామీలు అమలు చేసే దాకా రేవంత్ రెడ్డి.. నీ గుండెల్లో నిద్రపోతా**

**- తనపై హత్యాయత్నం చేసిన సీఎంపై కేసు పెట్టాలి**

**- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్** తనను హత్య చేయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని పంపించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కౌశిక్ రెడ్డిని హత్య చేయాలంటూ తానే పంపించినట్లు పరోక్షంగా సీఎం చెప్పారని ఆయన వెల్లడించారు. కానీ మంత్రి శ్రీధర్ బాబు ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గొడవపడ్డారని అంటున్నారని, వారిద్దరూ చెప్పే మాటలకు ఎక్కడా పొంతన లేదని ఎమ్మెల్యే అన్నారు. తనపై హత్యాయత్నం చేసిన సీఎం రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని తెలంగాణ డీజీపీని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. సీఎంపై కేసు పెట్టాలి.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.."నాపై దాడి చేసేందుకు తానే పంపినట్లు సీఎం రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారు. నన్ను హత్య చేయాలని ఎందుకు అనుకుంటున్నారు సీఎం గారు?. మీరిచ్చిన హామీలు నెరవేర్చాలంటూ ప్రశ్నిస్తున్నా కాబట్టి హత్య చేయాలని అనుకుంటున్నారా?. రేవంత్ నన్ను హత్య చేయాలని ఒప్పుకున్నారు. దీనిపై డీజీపీ, హోమ్ సెక్రటరీ స్పందించాలి. లేకుంటే గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలుస్తాం. సీఎంపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని డీజీపీని డిమాండ్ చేస్తున్నా. ఈ విషయంలో సైబరాబాద్ సీపీ డైనమిక్‌గా పని చేయాలి.

### ఎవరినీ వదలం..

ఒక ఎమ్మెల్యే ఇంటి మీదకు ఎస్కార్ట్ ఇచ్చి మరీ ఎటాక్ చేపిస్తే ఇప్పటివరకూ చర్యలు తీసుకోరా?. కాంగ్రెస్ పాలన శాశ్వతం కాదు.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలిపెట్టం. చంపితే చావడానికి సిద్ధమే, కానీ రేవంత్ రెడ్డితో కాంప్రమైజ్ మాత్రం కాను. ఆరు హామీలు అమలు చేసే దాకా సీఎం గుండెల్లో నిద్రపోతా. నా ఇంటికి వచ్చావ్. నన్ను పీసీసీ చీఫ్ చేయమని నా కాళ్లు మొక్కినవ్. తెలంగాణ నీ అయ్య జాగీరా?. చంపేస్తామంటూ నాకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. భయపడేది లేదు. నన్ను ఎవరైనా హత్య చేస్తే రేవంత్ రెడ్డిదే బాధ్యత.

### ఆ ఇల్లు కూల్చరా?

సీఎం రేవంత్ రెడ్డి సోదరుడికి హైడ్రా నోటీసులు ఇచ్చి 20రోజులు అవుతుంది. ఇప్పటివరకూ ఇల్లు ఎందుకు కూల్చలేదు. తన అన్న ఇల్లు కూల్చుతానని చెప్పిన సీఎం ఆయనకు మరో ఇల్లు ఇప్పించారు. బిల్డర్‌ను బెదిరించి మరీ తన సోదరుడికి ఇంటిని ఇప్పించారు. మరి పేద ప్రజల పరిస్థితి ఏంటి?" అంటూ ప్రశ్నించారు.

# సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ పెట్టడం సిగ్గుమాలిన చర్య

**- ఇది తెలంగాణ తల్లిని అవమానించడమే**

**- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శ**



**హైదరాబాద్** తెలంగాణకు సంబంధం లేని దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని రాష్ట్ర సచివాలయం ఎదుట పెట్టడం సిగ్గుమాలిన చర్య అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత వేముల ప్రశాంత్ రెడ్డి) విమర్శలు చేశారు. తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన చోట రాజీవ్ విగ్రహాన్నిపెట్టడం అంటే తెలంగాణ తల్లిని అవమానించడమేనని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ బాసులకు ప్రసన్నం చేసుకోవడానికి.. తెలంగాణ ఆత్మను తాకట్టు పెట్టారని ఆరోపించారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆనాడే సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని భావించారని అన్నారు. 2023 జూన్‌లో అందుకు సంబంధించిన ప్రణాళికలను సైతం సిద్ధం చేశారని గుర్తుచేశారు. సచివాలయానికి, అమరజ్యోతి మధ్య అనుసంధానంగా ఉండేలా కేసీఆర్ చేశారని చెప్పారు. కానీ రేవంత్ చర్యలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. డైవర్ట్ పాలిటిక్స్‌లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇలాంటి పనులు చేస్తున్నారని వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు చేశారు.రేవంత్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే తెలంగాణ తల్లి గౌరవం పెంచేలా తమ చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అమరజ్యోతి కట్టి ఏడాది దాటినా రేవంత్ దాన్ని ఇంకా అందుబాటులోకి తీసుకు రావడం లేదని అన్నారు.

కేసీఆర్ కట్టిన సచివాలయంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు కూర్చుంటున్నారని వేముల ప్రశాంత్ రెడ్డి గుర్తుచేశారు.కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో రివ్యూలు చేస్తున్నారని అన్నారు. కానీ కేసీఆర్ కట్టారన్న కారణంతో అమరజ్యోతిని సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు. తెలంగాణ అమరులను అగౌరవ పరచవద్దని వేముల ప్రశాంత్ రెడ్డి హితవు పలికారు. అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించి ఏడాది అవుతున్న ఇంకా లోపలకు సందర్శకులను ఎందుకు అనుమతించడం లేదని నిలదీశారు. కేసీఆర్ కట్టినందుకే అనుమతించడం లేదా అని అడిగారు. కేసీఆర్ ఆనవాళ్లు ఎవరు చెరిపేయలేరని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# లంబోదరుడి నిమజ్జనం సందర్భంగా జంటనగరాల్లో మెడికల్ క్యాంపులు

**- అధికారులకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆదేశం**



**హైదరాబాద్** లంబోదరుడి నిమజ్జనం సందర్భంగా జంటనగరాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అత్యవసర వైద్య చికిత్స అవసరమున్నవారికి అంబులెన్స్‌లను కూడా ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ.. అధికారులను ఆదేశించారు. అందుకుతగ్గట్లు వైద్య, ఆరోగ్య శాఖ ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సచివాలయంలో ఆయన మాట్లాడుతూ.. "నిమజ్జనం జరిగే ప్రాంతాలలో హెల్త్ క్యాంపులు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలి. అత్యవసర పరిస్థితుల్లో సత్వర వైద్యాన్ని అందించేందుకు డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండాలి" అని దామోదర సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనం జరుగుతున్న ప్రాంతాలలో ముందస్తుగా 30 చోట్ల హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని ట్యాంక్ బండ్‌కు లక్షలాదిగా తరలివస్తున్న భక్తులు, పర్యాటకులకు అత్యవసర పరిస్థితులలో వైద్య సేవలు అందించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అందుకు తగ్గట్లు డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచారు. వైద్య అత్యవసర పరిస్థితులలో ఆసుపత్రికి చేరుకునే వారికి సత్వర వైద్యాన్ని అందించేందుకు సమాయత్తం అయ్యారు.

# పెళ్లి బంధంతో ఒకటైన హీరోహీరోయిన్ సిద్ధార్థ్, అదితి రావు హైదరీ



సౌత్ ఇండియన్ సంప్రదాయ పద్ధతిలో జరిగిన వివాహం ఇరు కుటుంబసభ్యులు, అతికొద్ది మంది సన్నిహితుల సమక్షంలో సిద్ధార్థ్, అదితి పెళ్లి తమ పెళ్లి ఫోటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ వివాహ బంధాన్ని అధికారికంగా ప్రకటించిన సిద్ధార్థ్ అదితి. నా సూర్యుడు నువ్వే.. నా చంద్రుడు నువ్వే.. నా నక్షత్రాలన్నీ నువ్వే" అంటూ అందమైన క్యాప్షన్ తో సిద్ధార్థ్ పై ప్రేమను వ్యక్తం చేసినఅదితి ప్రస్తుతం సిద్ధార్థ్, అదితి పెళ్లి ఫోటోస్ నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి. నూతన వధూవరులకు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్స్ శుభాకాంక్షలు చెబుతున్నారు.

# ఉదయమే మందు తాగుతున్నారా?

**- మందు బాబులకు క్లాస్ పీకిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి**

**నల్గొండ** ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సోమవారం నాడు మునుగోడు పట్టణంలో వైన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసారు. నకిలీ మందు అమ్ముతున్నారా అని అడుగుతూ మద్యం బాటిల్స్ పరిశీలించారు. పక్కనే ఉన్న పర్మిట్ రూములను పరిశీలించారు. పర్మిట్ రూముల్లో ఉదయాన్నే మద్యం తాగుతున్న మద్యం బాబులకు క్లాస్ ఇచ్చారు. మీరు ఉదయాన్నే ఇలా తాగుడుకు బానిసైతే కుటుంబ పరిస్థితి ఏంటి అని సీరియస్ అయి మద్యం బాబులను పర్మిట్ రూము నుండి బయటికి పంపారు. ఉదయం పూట పర్మిట్ రూముల్లోకి అనుమతి ఇవ్వొద్దంటూ వైన్ షాపుల యజమానులకు హుకుం జారీ చేసారు. అధిక తాగుడును నిర్మూలించడానికి ఎమ్మెల్యే మద్యం షాపుల పరిశీలన జరిగింది. బెల్ట్ షాపులకు మద్యం అమ్ముతున్నారా అంటూ ఆరా తీసారు.

# మాధవరంలో ఘనంగా గణపతి నిమర్జనోత్సవం



**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 16** తాడేపల్లిగూడెం మండలం మిలటరీ మాధవరం లో పోలేరమ్మ ఆలయ సమీపంలోని అభయాస్తా ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవం ఊరేగింపు సోమవారం ఘనంగా నిర్వహించారు. కాళికా వేషాలు, మేళ తాళాలు, తీన్మార్ డప్పులు, బుట్ట బొమ్మలతో గ్రామంలో ఊరేంపుఘనంగా నిర్వహించారు. యువత కేరింతల నడుమ స్వామివారి ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎలాంటి గొడవలు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



# ప్రమకు బ్రేకప్ చెప్పేశా

## - నటి మృణాళ్ ఠాకూర్ వెల్లడి

ఈ మధ్యకాలంలో ఇష్టపడిన వ్యక్తితో ప్రేమ, కొంతకాలానికి బ్రేకప్ సినీ సెలబ్రిటీల విషయంలోనూ ఇలాంటివి చూస్తూనే ఉంటాం. తాజాగా 'సీతారామం' ఫేం మృణాల్ ఠాకుర్‌కు కూడా బ్రేకప్ అయిందట. ఏడు నెలల క్రితం బ్రేకప్ జరిగిన విషయాన్ని తాజాగా రివీల్ చేసింది. ఇటీవల ఆమె ఓ పాడ్ కాస్ట్‌లో మాట్లాడుతూ తన లవ్ స్టోరీస్ గురించి చెప్పింది. ఒక వ్యక్తి జీవితంలోకి సరైన వ్యక్తి భాగస్వామిగా రావడానికి కాస్త సమయం పడుతుంది. ఈలోపు జీవితంలోకి వచ్చివెళ్లేవాళ్లు చాలామంది ఉంటారు. ఫైనల్‌గా మనకు ఎవరు సూట్ అవుతారనేది మనకే తెలుస్తుంది. ఆ విషయంలో పక్కాగా క్లారిటీ ఉండాలి. నేను గతంలో ఓ వ్యక్తితో రిలేషన్‌లో ఉన్నా. కానీ నటితో డేటింగ్ అతడికి ఎందుకో ఇష్టం లేదు. పద్ధతి గల కుటుంబం నుంచి వచ్చానని చెప్పాడు. ఆ మాట నాకు నచ్చలేదు. దీంతో బ్రేకప్ చెప్పేసుకున్నాం. ఏడు నెలల క్రితమే నాకు బ్రేకప్ అయింది. అయితే నన్ను చేసుకునేవాడికి లుక్స్ లేకపోయినా పర్లేదు కానీ మంచి మనిషి అయ్యుండాలి' అని మృణాల్ ఠాకుర్ చెప్పుకొచ్చింది. ఇప్పటివరకు తన జీవితంలో బ్రేకప్స్ జరిగాయి కానీ మరీ బాధ పడిపోయేంతలా ఏం కాలేదని మృణాల్ చెప్పింది. మ్యూచ్‌వల్ అండర్‌స్టాండింగ్ తోనే విడిపోయామని పేర్కొంది. హిందీ సీరియళ్లతో కెరీర్ ప్రారంభించిన మృణాల్ 'సీతారామం' తెలుగులో బ్లాక్ బస్టర్ ఎంట్రీ ఇచ్చింది. 'హాయ్ నాన్న', 'ఫ్యామిలీస్టార్' తదితర చిత్రాలతో గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం హిందీ చిత్రాలతో బిజీగా ఉంది.

# త్వరలోనే పట్టాలెక్కనున్న 'ధూమ్ 4'

## కీలక పాత్రలో కనిపించనున్న సూర్య



బాలీవుడ్‌లో తెరకెక్కిన హెయిస్ట్ యాక్షన్ ఫిల్మ్స్‌లో 'ధూమ్' కు విశేష ఆదరణ ఉంది. 2004లో తెరకెక్కిన ఈ చిత్రానికి ఇప్పటికే పలు సీక్వెల్స్ వచ్చాయి. బాక్సాఫీస్ వద్ద అవన్నీ సూపర్ హిట్స్ అందుకున్నాయి. ఈ ఫ్రాంఛైజీలోనే త్వరలో 'ధూమ్ 4' పట్టాలెక్కనున్నట్లు తెలుస్తోంది. చిత్ర నిర్మాణసంస్థ యశ్ రాజ్ ఫిల్మ్స్ ఈమేరకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'ధూమ్, పార్ట్ 2, 3'లకు కథను అందించిన ఆదిత్య చోప్రానే 'ధూమ్ 4'కీ వర్క్ చేస్తున్నారని.. ప్రస్తుతం ఉన్న ట్రెండ్‌కు అనుగుణంగా భారీస్థాయిలో దీనిని సిద్ధం చేసేందుకు నిర్మాతలు ప్రయత్నిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలాఉండగా, ఈ చిత్రంలో కోలీవుడ్ నటుడు సూర్య కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సినిమాలో ముఖ్యమైన ప్రతి నాయకుడి పాత్రలో సూర్య నటించనున్నారని.. ఈవిషయంపై చిత్రబృందం ఇప్పటికే ఆయన్ని సంప్రదించినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ రోల్‌లో యాక్ట్ చేసేందుకు ఆయన ఆసక్తి చూపారని టాక్. దీనిపై పలువురు సినీప్రియులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. సూర్య యాక్ట్ చేస్తే మరో స్థాయిలో ఉంటుందని వారు భావిస్తున్నారు. మరి కొంతమంది మాత్రం అధికారిక ప్రకటన కోసం వేచి చూస్తున్నామని అంటున్నారు. నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో యాక్ట్ చేయడం సూర్యకు కొత్త ఏమీ కాదు. ఆయన ఇప్పటికే '24', 'విక్రమ్' చిత్రాల్లో అలాంటి రోల్స్ పోషించారు. 2022లో వచ్చిన 'విక్రమ్' చిత్రంలో రోలెక్స్‌గా కనిపించి అందర్నీ ఆశ్చర్యపరిచారు.

మాదక ద్రవ్యాల ముఠాకు నాయకుడిగా ఆయన నటన అందర్నీ కట్టిపడేసింది. రోలెక్స్ పాత్ర కనిపించేది కేవలం కొన్ని నిమిషాలే అయినప్పటికీ.. సినిమాకే హైలైట్‌గా నిలిచింది.

# వివాహ బంధంతో ఒక్కటైన నటుడు సిద్దార్థ్ , నటి అదితిరావు హైదరీ



నటుడు సిద్దార్థ్ , నటి అదితిరావు హైదరీ తాజాగా వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో వనపర్తిలోని దేవాలయంలో వీరి వివాహం జరిగింది. దీనికి సంబంధించిన ఫొటోలను సోషల్‌మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. నువ్వే నా సూర్యుడు.. నువ్వే నా చంద్రుడు.. అలాగే నువ్వే నా తారాలోకం. మిసెస్ అండ్ మిస్టర్ అదు సిద్ధు' అని అదితి క్యాప్షన్ జత చేశారు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. నూతన జంటకు నెటిజన్లు శుభాకాంక్షలు చెబుతున్నారు. సిద్దార్థ్‌తో రిలేషన్ గురించి అదితి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. 'మహా సముద్రం' షూట్‌లో తమ మధ్య పరిచయం ఏర్పడిందన్నారు. కొంతకాలానికి అది స్నేహంగా మారిందన్నారు. తనకెంతో ఇష్టమైన ప్రదేశంలో సిద్దార్థ్ తనకు ప్రపోజ్ చేశాడని చెప్పారు. మా నాన్నమ్మ అంటే నాకెంతో ఇష్టం. హైదరాబాద్‌లో ఆమె ఒక స్కూల్ ప్రారంభించారు. అది నాకెంతో ప్రత్యేకం. నా చిన్ననాటి రోజులు అక్కడే ఎక్కువగా గడిపా. కొన్నేళ్లక్రితం ఆమె కన్నుమూశారు.

ఈ విషయం సిద్దార్థ్‌కు తెలుసు. ఓ రోజు నా వద్దకువచ్చి.. ఆ స్కూల్‌కు తీసుకువెళ్లమని అడిగాడు. మార్చిలో మేమిద్దరం అక్కడికి వెళ్లాం. మోకాళ్లపై కూర్చొని.. అతను నాకు ప్రపోజ్ చేశాడు. ఆమె ఆశీస్సుల కోసమే తాను అక్కడ ప్రపోజ్ చేసినట్లు చెప్పాడని అదితి చెప్పారు.అయితే సిద్దార్థ్ గతంలోనే పెళ్లి చేసుకోగా..అతనికిది రెండో వివాహం.

# దేవర ప్రీ రిలీజ్ ఈవెంట్

## - మహేశ్‌బాబు గెస్ట్ అంటూ ప్రచారం




'దేవర' ప్రీ రిలీజ్ ఈవెంట్‌పై వార్తలు దుమారం రేపుతున్నాయి. ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు నటుడు మహేశ్ వస్తున్నారన్న ప్రచాంరం జోరందుకుంది. ఈ చిత్రం తెలుగుతో పాటు హిందీ, కన్నడ, మలయాళం, తమిళం భాషలలో సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'అరవింద సమేత వీర రాఘవ' వంటి బ్లాక్ బస్టర్ తరువాత ఎన్టీఆర్ సోలోగా వస్తుండటంతో ఈ మూవీపై ఇటు టాలీవుడ్‌తో పాటు పాన్ ఇండియా వైడ్‌గా భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి ఓవర్సీస్‌లో బుకింగ్స్ స్టార్ట్ అవ్వగా 5 లక్షలకు పైగా టికెట్స్ బుక్ అయినట్లు మేకర్స్ ప్రకటించారు. మరోవైపు రీసెంట్‌గా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేయగా.. రికార్డు వ్యూస్‌తో యూట్యూబ్‌లో దూసుకుపోతుంది. ఇదిలావుంటే ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ భారీ ఎత్తున్న ఎ÷–లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు టాలీవుడ్ నుంచి సూపర్ స్టార్ మహేశ్ బాబుని పిలవాలని దేవర టీం ఆలోచిస్తున్నట్లు సమాచారం.

ఇప్పటికే భరత్ అనే నేను ఈవెంట్‌కు ఎన్టీఆర్ చీఫ్ గెస్ట్‌గా వచ్చి సందడి చేశాడు. దీంతో అప్పటినుంచి మహేశ్– తారక్‌ల మధ్య బాండింగ్ మరింత ఎక్కువ అయ్యింది. అయితే ఈ ఈవెంట్‌కు మాత్రం మహేశ్ వస్తే అభిమానులకు ఆనందానికి హద్దు లేకుండా పోతుందని చెప్పవచ్చు. హై వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ సినిమాకు జనతా గ్యారేజ్ ఫేం కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా.. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుంది. సైఫ్ అలిఖాన్ విలన్ రోల్‌లో నటిస్తున్నాడు. ప్రకాశ్ రాజ్, శ్రీకాంత్, గెటప్ శ్రీను తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# డ్రగ్స్‌తో ఎలాంటి సంబంధం లేదు

## - పదేపదే ప్రచారంపై నటి హేమ మండిపాటు



బెంగళూరు రేవ్ పార్టీలో టాలీవుడ్ సినీ నటి హేమ డ్రగ్స్ తీసుకున్నట్లు పోలీసులు కేసు నమోదు కాగా..తాను డ్రగ్స్ తీసుకోలేదని హేమ వాదిసతోంది. హేమ డ్రగ్స్ తీసుకున్నట్టు నివేదికలో పేర్కొన్న పోలీసులు ఎండీఎంఏ మెడికల్ రిపోర్ట్‌ను కూడా జత చేశారు. ఈ కేసులో నటి హేమతోపాటు 88 మంది డ్రగ్స్ తీసుకున్నారని పోలీసులు వివరించారు. చార్జీషీట్‌లో రేవ్ పార్టీ నిర్వాహకులుగా 9 మందిని పేర్కొన్నారు.అయితే తాను డ్రగ్స్ తీసుకున్నట్లు పలు మీడియా ఛానళ్లు ప్రచారం చేయడంపై నటి హేమ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఒక వీడియోను సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. నేను డ్రగ్స్ తీసుకున్నట్లు గతంలో ఎలా అయితే పలు మీడియా ఛానళ్లు ప్రచారం చేశారో.. అదే పాత వార్తలను తీసుకువచ్చి మళ్లీ ప్రచురిస్తున్నారు. హేమకు పాజిటివ్ వచ్చింది అంటూ ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారు. పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీట్ నేనే ఇంకా చూడలేదు. మీరు ఎలా చూశారు అంటూ మీడియాపై మండిపడింది హేమ. తానే స్వయంగా మీడియా పెద్దల వద్దకు వస్తానని.. వారే టెస్ట్ చేయించాలని హేమ సవాల్ విసిరారు. డ్రగ్స్ తీసుకున్నట్లు తేలితే ఎంతటి శిక్షైనా అనుభవిస్తానని నెగిటివ్ వస్తే తనకు న్యాయం చేయాలన్నారు. పరువు కోసం చచ్చిపోవడానికైనా సిద్ధమని హేమ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# వైవిధ్యమైన కథతో గొర్రె పురాణం



వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న నటుడు సుహాస్ (ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'గొర్రె పురాణం' బాబీ దర్శకుడు. సెప్టెంబర్ 20న ఈచిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఒక గ్రామంలోని రెండు వర్గాల మధ్య ఒక గొర్రె వల్ల గొడవలు మొదలు కావడం.. దానిపై కేసు పెట్టడం వంటి అంశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకునేలా సాగింది. విలక్షణమైన పాత్రలతో తనకంటూ నటుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు హీరో సుహాస్. గత నెల 'ప్రసన్నవదనం' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చిన మంచి విజయాన్ని అందుకున్న ఈ కుర్ర హీరో మరో సినిమాను విడుదలకు సిద్ధం చేశాడు. ఆయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం గొర్రెపురాణం సినిమాకు బాబీ దర్శకత్వం వహిస్తుండగా.. ఫోకల్ సినిమాస్ బ్యానర్‌పై ప్రవీణ్ రెడ్డి సినిమాను నిర్మిస్తున్నాడు. విడుదలకు ఇంకా నాలుగు రోజులే ఉండడంతో ట్రైలర్‌ను వదిలింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఒక గొర్రె చేసిన పని వలన రెండు మతాలకు చెందిన ప్రజలు గొడవపడుతున్నట్లు ట్రైలర్ చూస్తే తెలుస్తుంది. అయితే అసలు గొర్రెకు హిందు, ముస్లింలకు మధ్య గొడవ ఏంటి.. రెండు మతాలకు చెందిన ఆ ఊరి ప్రజలు అసలు గొర్రెను ఎందుకు చంపాలి అనుకుంటారు. సుహాస్ జైలులో ఎందుకు ఉంటాడు. గొర్రెకు సుహాస్‌కు సంబంధం ఏంటి అనేది తెలియాలంటే ఈ సినిమా సినిమా చూడాల్సిందే.

# ఈ ఎన్నికలు గాంధీ-అబ్దుల్లా కుటుంబానికి బీజేపీకి మధ్య జరుగుతున్నాయి

హోదాపై చర్చలు జరగవని షా తన ప్రసంగంలో స్పష్టం చేశారు. ఈ వాస్తవాన్ని ఏ శక్తి తిప్పికొట్టలేదని పునరుద్ఘాటించారు. జమ్మూ కాశ్మీర్‌లో ఎన్నికల నేపథ్యంలో ఆర్టికల్ 370 ప్రధాన చర్చగా ఉంది. ఎవరు ఎన్నికల ప్రసంగం చేసినా కచ్చితంగా ఆర్టికల్ 370 రద్దు యొక్క ప్రాముఖ్యత గురించి వివరిస్తుండగా ఇంకొందరు అది ఎందుకు ఉండాలనేదానిపై తమ వాదనను వినిపిస్తున్నారు. ఈ ఎన్నికలు జమ్మూ కాశ్మీర్ భవిష్యత్తు కోసం రెండు విభిన్న దృక్పథాల మధ్య జరుగుతున్నవనే అభిప్రాయం ఉంది.జాతీయ ఐక్యతతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం భారతదేశం అంతటా ప్రాంతీయ ఎన్నికలలో బీజేపీ యొక్క విస్తృత వ్యూహాన్ని ప్రతిబింబిస్తుంది. అమిత్ షా ప్రసంగం ఈ ఇతివృత్తాలను పొందుపరిచింది, వీటి కోసం తమ జీవితాలను అర్పించిన వారికి నివాళులు అర్పిస్తూ ప్రగతిని ఎన్నుకోవాలని ఓటర్లను కోరారు.

# కేసీఆర్ ఫాంహౌస్‌లో జిల్లేళ్లు మొలిపిస్తా

ఏ బాధ్యత తీసుకోలేదు. కొందరు మాత్రం తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని మంత్రి పదవులు పొందారు' అంటూ కేటీఆర్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు రేవంత్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, సీతక్క, కొండా సురేఖ, రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపా దాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, వి. హనుమంతరావు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఎనర్జీకి ఆకాశమే హద్దు

వాతావరణాలను తట్టుకునేలా మన ఇంధన రంగానికి అనుకూల వ్యూహాలను రూపొందించడం అత్యావశ్యకం అని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. అందుకోసం శక్తి ఉత్పాదన, ప్రసారం, పంపిణీ, శక్తి వినియోగ విధానంలో ప్రాథమిక మార్పు అవసరం అని పేర్కొన్నారు. ఈ కోణంలోనే, 4వ ప్రపంచ పునరుత్పాదక ఇంధన పెట్టుబడిదారుల సదస్సు ప్రాధాన్యత సంతరించుకుందని వివరించారు. ప్రజా శ్రేయస్సు కోసం సాంకేతికత అంశంలో ఏపీ అగ్రగామిగా ఉందని, ఇప్పుడు ఇంధన రంగం వంతు అని చంద్రబాబు స్పష్టం చేశారు.గుజరాత్‌లో పీటీఐ మీడియా ఏజెన్సీతో మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీకి ఆకాశమే హద్దు. భవిష్యత్తులో దీనిని ఎలా అమలు చేయాలనేది చాలా కీలకం. ఇప్పుడు ఈజ్ ఆప్ దూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ దూ ఇయింగ్ బిజినెస్‌కు మారాల్సిన టైం వచ్చింది. ఈ మార్పుకు మద్దతు ఇచ్చే వాతావరణాన్ని సృష్టించుకున్నప్పుడు ఇది సాధ్యమవుతుంది. మనం పోటీ విధానాలు అభివృద్ధి చేయాలి. ప్రతి అంశాన్ని రియల్ టైంలో నిర్వహించేలా చూసుకోవాలి. సౌర ఫలకాలను తయారు నుంచి గ్రీన్ హైడ్రోజన్‌ను ఎగుమతి చేయడం వరకు ఆంధ్రప్రదేశ్‌లో చాలా అవకాశాలు ఉన్నాయని అన్నారాయన. ముఖ్య వక్తలలో ఒకరైన ఆంధ్రా సిఎం రాష్ట్రంలో అన్‌టాప్డ్ గ్రీన్ ఎనర్జీ సెక్టార్‌లో పెట్టుబడుల ఆహ్వానం కోసం ఇక్కడకు వచ్చారు.

# రాజీవ్ గాంధీ విగ్రహం గాంధీ భవన్‌కు తరలించి తీరుతాం

పెట్టడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ అస్తిత్వాన్ని తాకట్టు పెట్టే సిగ్గుమాలిన చర్య అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి చర్యకు నిరసనగా నేడు రాష్ట్రంలోని అన్ని తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలభిషేకాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

## గాంధీభవన్ కు రాజీవ్ గాంధీ విగ్రహం

కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టుకోవాలనుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కానీ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయటాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. తెలంగాణ సచివాలయం, అమర జ్యోతి మధ్యలో తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని కేసీఆర్ 2023 జులైలోనే ఈ స్థలాన్ని ఎంపిక చేశారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కుసంస్కారంతో తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేని వ్యక్తి విగ్రహాన్ని ఆ స్థలంలో ఏర్పాటు చేసిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ తల్లి విగ్రహం కోసం కేటాయించిన ఆ స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. సకల మర్యాదలతో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీ భవన్ కు తరలిస్తామని తేల్చి చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణ తల్లి విగ్రహం కోసం ఏర్పాటు చేసిన స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహం ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ఢిల్లీ మెప్పు కోసం తెలంగాణ ఆత్మ తాకట్టు

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి ఢిల్లీకి బానిసత్వం చేస్తారని తాము ముందునుంచే చెప్పామని కేటీఆర్ గుర్తు చేశారు. కేవలం ఢిల్లీ బాసుల మెప్పు కోసమే తెలంగాణను ఆత్మను తాకట్టు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు, తెలంగాణ మనో భావాల కన్నా కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఢిల్లీ బాసుల మెప్పు పొందటమే ముఖ్యమైపోయిందని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి చర్యను యావత్తు తెలంగాణ సమాజం చీదరించుకుంటున్న సిగ్గు లేకుండా తెలంగాణ తల్లిని అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## తెలంగాణ అస్తిత్వతం పెట్టుకున్న వాళ్లకు రాజకీయ సమాధే

తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కన్నా కూడా కాంగ్రెస్ నాయకులకు స్వప్రయోజనాలే ముఖ్యమైపోయాయన్నారు. తెలంగాణ ఉద్యమకారులమంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ నాయకులంతా ఢిల్లీకి గులామ్ లేనని తేలిపోయిందన్నారు. తెలంగాణ ప్రజలా? ఢిల్లీ బాసులా? అంటే కాంగ్రెస్ నాయకులంతా ఢిల్లీ బాసులకే జీ హుజూర్ అంటారన్న విషయం మరోసారి స్పష్టమైందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ అస్తితత్వం తో పెట్టుకున్న వాళ్లెవరు రాజకీయంగా బతికి బట్టకట్టలేదని ఈ సందర్భంగా కేటీఆర్ హెచ్చరించారు.

## తెలంగాణలకు బీఆర్ఎస్ మాత్రమే శ్రీరామరక్ష

తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ మాత్రమే రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఢిల్లీ బాసుల మెప్పు కోసం కాకుండా తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ముందు నిలబడుతుందన్నారు. కచ్చితంగా తెలంగాణకు బీఆర్ఎస్ శ్రీరామరక్షగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

# వరదలకు చెక్ పెట్టేలా ఏపీ ప్రభుత్వం కొత్త స్కెచ్

మునిగిపోతుందంటూ ప్రతిపక్షం చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇస్తున్న ప్రభుత్వం ఎంత వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా పక్కా ప్లాన్ రెడీ చేసింది. ఇందులో భాగంగా అమరావతి రాజధాని నిర్మాణంలో మూడు కాల్వలను సైతం డిజైన్ చేశారు. ఈ విషయాన్ని ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. విజయవాడలో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి దీనికి సంబంధించి కీలక వివరాలు వెల్లడించారు

. రాజధాని అమరావతి చాలా సురక్షితంగా ఉందన్న నారాయణ కృష్ణానదికి 15 లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చినా కూడా ఇబ్బంది లేకుండా రాజధాని నిర్మాణం ప్లాన్ చేస్తున్నట్లు చెప్పారు. పాలవాగు, కొండవీటి వాగు, గ్రావిటీ కెనాల్స్ డిజైన్ టేసినట్లు చెప్పారు. వీటి గురించి ఏడీసీ ఛైర్మన్, అధికారులతో మాట్లాడామన్న మంత్రి వచ్చే వర్షాకాలం నాటికి పూర్తిచేస్తామని చెప్పారు. త్వరలోనే టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. వీటితో పాటుగా వైకుంఠపురం, ఉండవల్లి వద్ద పంపింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని వివరించారు.

అలాగే ఆరు రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసామన్న మంత్రి ఇవన్నీ పూర్తి అయితే అమరావతిలో ఎలాంటి వరద సమస్యా ఉండదని స్పష్టం చేశారు. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసే తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని నారాయణ ప్రజలకు సూచించారు. అమరావతి మునిగిపోయిందని ప్రచారాలు చేశారన్న మంత్రి వాటిని నమ్మి ఇబ్బందులు పడవద్దని ప్రజలకు సూచించారు. రాజధాని నిర్మాణంలో ప్లాన్ చేసిన కాల్వలు, రిజర్వాయర్ల నిర్మాణం పూర్తి అయితే ఎలాంటి సమస్యలు ఉండవని తెలిపారు. మరోవైపు రాజధాని నిర్మాణం కోసం ల్యాండ్ పూలింగ్ విధానంలో భూమిని సేకరిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. భూమిని ఇచ్చే రైతులు తమకు సమాచారం ఇస్తే వారి ఇంటికి నేరుగా వెళ్లి అంగీకారపత్రాలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ప్రభుత్వ భూములు ఉన్నచోట ఎక్కడ కోరితే అక్కడ వారికి ప్లాట్లు కేటాయిస్తామని నారాయణ వివరించారు.

# నిమజ్జనాలకు సర్వం సిద్ధం

వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నేడు ఉదయం 6.30 గంటలకు ప్రారంభం కానున్న ఖైరతాబాద్ గణేశుడి శోభాయాత్ర మధ్యాహ్నం 1.30 గంటల లోపు నిమజ్జనం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇక సాయంత్రం 4 గంటలకు బాలాపుర్ గణేషుడు హుస్సేన్ సాగర్ వద్దకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో మొత్తం 25 వేల మంది పోలీసులు పహారా కాస్తున్నట్లు సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇందులో 3వేలమందిని హుస్సేన్ సాగర్ పరిసరాల్లో మోహరించినట్లు పేర్కొన్నారు. మరోవైపు మహిళల భద్రతకు 12 షీటీమ్స్ బృందాలను రంగంలోకి దించారు. ఇక మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం రాత్రి 11 గంటల వరకు భారీ వాహనాలను, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను హైదరాబాద్ నగరంలోకి అనుమతించేది లేదని అధికారులు వెల్లడించారు. నగరంలో మొత్తం 67 డైవర్షన్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అత్యవసర సమయాల్లో ట్రాఫిక్ హెల్ప్ లైన్ కోసం 9010203626, 8712660600, 040-27852482 నంబర్లకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఖైరతాబాద్ గణపతి శోభాయాత్ర నేడు ఉదయం 6.30 గంటలకు ప్రారంభం కానుంది. దీనికోసం 700 మంది పోలీసులను కేటాయించారు. ఈ మార్గంలో మొత్తం 56 సీసీటీవీ కెమెరాలతోటు ట్రాఫిక్ సీసీటీవీ కెమెరాలతో భద్రతను పర్యవేక్షించనున్నారు. ఇక బాలాపూర్ వినాయకుడి వద్ద 220 మంది పోలీసులను మోహరించారు. 30 సీసీటీవీ కెమెరాలతో రాచకొండ పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. వేలంపాట పూర్తయిన తర్వాత ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న బాలాపూర్ గణేష్ శోభాయాత్ర ప్రారంభం కానుండగా 16 కిలోమీటర్లు ప్రయాణించి ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకోనుంది. ఇక హైదరాబాద్ మహానగర పరిధిలో గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట తెలిపారు. నిమజ్జనం సందర్భంగా మంగళవారం నుంచి 3 రోజుల పాటు 15 వేల మంది జీహెచ్ఎంసీ సిబ్బంది 3 షిఫ్టుల్లో పనిచేయనున్నట్లు వెల్లడించారు. జీహెచ్ఎంసీ పరిధిలో 465 క్రేన్లు, హుస్సేన్‌సాగర్ వద్ద 38 క్రేన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇక నిమజ్జనం సందర్భంగా.. విగ్రహాల శోభాయాత్రలో కలర్ పేపర్లు, పూలు, చెత్త రోడ్లపై వేయవద్దని ఆమ్రపాలి విజ్ఞప్తి చేశారు. రోడ్లపై కలర్ పేపర్లు, చెత్త వేయడం వల్ల జీహెచ్ఎంసీ పారిశుధ్య సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని అందరూ సహకరించాలని ఆమ్రపాలి కోరారు.

# చరిత్రహీనులు కావొద్దు

మళ్లీ మొదటికి వస్తున్నాయని ఆరోపించారు. మీ ఇళ్లల్లో పిల్లలకు అత్యుత్తమ చదువులు అందించాలనుకుంటారు కానీ, గవర్నమెంటు స్కూలు పిల్లల విషయంలో వివక్ష ఎందుకంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. సర్కారీ బడుల్లో చదివే పిల్లలు ఎప్పటికీ కింది స్థాయిలోనే ఉండిపోవాలా? వారి జీవితాలకు మీరు శాపం పెట్టిన మాదిరిగా ఈ నిర్ణయాలు ఏంటి అంటూ జగన్ ట్వీట్ చేశారు. "గవర్నమెంటు స్కూళ్ల రూపురేఖలు మార్చే కార్యక్రమాలను రద్దుచేయడం ఎంతవరకు సమంజసం? ముఖ్యమంత్రిగా మీ 14 ఏళ్లకాలంలో చేయలేని పనులన్నీ ఐదేళ్లలో వైయస్సార్‌సీపీ ప్రభుత్వం చేసింది. నాడు-నేడు, ఇంగ్లిషు మీడియం, సీబీఎస్ఈ, ఐబీ వైపు అడుగులు, టోఫెల్, సబ్జెక్టు టీచర్ల కాన్సెప్ట్, తరగతి గదుల్లో 6వ తరగతి నుంచి ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్, 8వ తరగతి వచ్చే సరికే ట్యాబుల పంపిణీ, విద్యా కానుక, రోజుకో మెనూతో గోరుముద్ద ఇలా పేద పిల్లల తలరాతలను మార్చే చదువులను అందించడానికి వైయస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను తీసుకువచ్చింది. మీ హయాంలో ఇప్పుడు ఒక్కొక్కటిగా వీటిని రద్దుచేస్తూ వస్తున్నారు. గవర్నమెంటు స్కూళ్ల పిల్లలను ప్రైవేటు బాట పట్టించడానికి మీరు, మీ కుమారుడు కుట్రను అమలు చేస్తున్నారు" అంటూ జగన్ ట్వీట్ చేశారు."మీ పార్టీ నాయకులకు చెందిన ప్రైవేటు స్కూళ్లు బాగుండాలి? గవర్నమెంటు స్కూళ్లు నిర్వీర్యం అయిపోవాలి? మీ ఉద్దేశం అదేగా? తమ పిల్లలకు మంచి చదువులు అందించడం కోసం తల్లిదండ్రులు వారి సొంత జేబు నుంచి ఎందుకు ఖర్చుచేయాలి? అలాంటప్పుడు ఇక ప్రభుత్వాలు ఎందుకు? గవర్నమెంటు స్కూళ్లలో ఇంగ్లిషు మీడియంను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీరు కోర్టులకువెళ్లి అడ్డుకున్న తీరును ఇప్పటికీ ప్రజల మరిచిపోలేరు." అంటూ వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ పాఠశాలల్ల చదువులు చెప్పే ఉపాధ్యాయులు ఎందులోనూ తక్కువ కాదన్న వైఎస్ జగన్ లక్షలమంది పోటీపడే పరీక్షల్లో ఉత్తీర్ణులై, చక్కటి శిక్షణ కూడా తీసుకుని ఉంటారన్నారు. ప్రైవేటు స్కూళ్లలో ఉన్నవారి కంటే గొప్పచదువులు చదువుకుని విద్యార్థులకు చక్కగా చదువులు చెప్తారని అభిప్రాయపడ్డారు. అలాంటివారిని తక్కువగా చూసే మనస్తత్వాన్ని మార్చుకోవాలని చంద్రబాబుకు సూచించారు. చదువు పేదరికాన్ని నిర్మూలించే ఆయుధమని అభివర్ణించిన జగన్ ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసే తప్పుడు పనులను మానుకోవాలని హితవు పలికారు. లేదంటే చరిత్రహీనులుగా, పేద ప్రజల వ్యతిరేకులుగా మిగిలిపోతారని హెచ్చరించారు.

# కేజ్రీవాల్ రాజీనామాకు ముహూర్తం ఖరారు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో నిర్దోషినని నిరూపించుకునేంత వరకు సీఎం పదవిలో కొనసాగబోనని, రెండు రోజుల్లో పదవికి రాజీనామా చేస్తానంటూ ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన రాజీనామాకు ముహూర్తం కూడా ఖరారైంది. కేజ్రీవాల్ సోమవారం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అపాయింట్‌మెంట్ కోరారు. నేడు సాయంత్రం 4.30 గంటలకు సమయం ఇస్తున్నట్టు వీకే సక్సెనా కార్యాలయం సమాచారం ఇచ్చింది. దీంతో నేడు లెఫ్టినెంట్ గవర్నర్‌తో భేటీ సందర్భంగా కేజ్రీవాల్ తన రాజీనామా లేఖను సమర్పించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఢిల్లీ సీఎం పదవీకాలం ముగియడానికి కొన్ని నెలల సమయం మాత్రమే ఉంది. అయితే ప్రజాదరణ, పార్టీలో మంచి పేరున్న వ్యక్తిని సీఎం పీఠంపై కూర్చోబెట్టాలని ఆప్ నాయకత్వం యోచిస్తోంది. సీఎం రేసులో ప్రముఖంగా ఐదుగురి పేర్లు వినిపిస్తున్నప్పటికీ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా జైలులో ఉన్నప్పుడు పార్టీని, ప్రభుత్వాన్ని చక్కబెట్టిన మహిళా మంత్రి అతిషి పేరు సీఎం రేసులో ఎక్కువగా వినిపిస్తోంది. కాగా, ఆదివారం మధ్యాహ్నం ఆప్ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించిన సీఎం కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేశారు. రెండు రోజుల్లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని అన్నారు. తనను జైలుకు పంపి, ఆప్‌లో చీలికలు తీసుకురావాలని ప్రయత్నించారని, తద్వారా ఢిల్లీ పీఠం చేజిక్కించుకోవాలని భావించారని బీజేపీని ఉద్దేశించి ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా ఆప్‌ను విచ్ఛిన్నం చేయలేకపోయారని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించాలనే ఇన్నాళ్లు రాజీనామా చేయలేదని తెలిపారు.

# మద్యం ప్రియులకు షాక్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గణేష్ నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్ లో వైన్ షాపులు అన్నింటినీ మూసేయాలని పోలీసులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వినాయక నిమజ్జనం జరిగే మంగళ, బుధవారాల్లో అన్ని మద్యం షాపులు మూసి వేయాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

గణేశ్ నిమజ్జన వేడుకల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. నేడు ఉదయం 6 గంటల నుంచి రేపు (సెప్టెంబరు 18) సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో మద్యం దుకాణాలు, కల్లు కాంపౌండ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లను మూసివేయాలని పోలీసులు ఆదేశాలు ఇచ్చారు. ఆదేశాలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు. స్టార్ హోటల్ బార్స్, రిజిస్టర్ క్లబ్స్‌కు మాత్రం ఈ ఆదేశాలు వర్తించబోవని పోలీసులు తెలిపారు.

# అక్టోబర్ నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ

అందుకు తగ్గట్లుగానే గతేడాది చివరలో ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరించింది. ఇందులో రేషన్ కార్డులకు దరఖాస్తుకు అవకాశం కల్పించింది. దీంతో లక్షలాది మంది కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ లో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది.

న్యూ రేషన్ కార్డులకు సంబంధించి సెప్టెంబర్ 16న కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. సబ్ కమిటీ భేటీ తర్వాత రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రకటన చేశారు. కొత్త రేషన్ కార్డు విధివిధానాలు రూపొందిస్తున్నట్లు వారు తెలిపారు. ఎవరు తెల్ల రేషన్ కార్డుకు అర్హులనేది వచ్చే సమావేశంలో నిర్ణయిస్తామని పేర్కొన్నారు.

ఇతర రాష్ట్రాల్లో రేషన్ కార్డులు ఎలా ఇస్తున్నారు అనేది కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. రేషన్ కార్డుల నిబంధనలు ఎలా ఉండాలని వివిధ పార్టీలకు లేఖలు కూడా రాసినట్లు వారు మీడియాకు తెలిపారు. కొంత మంది ప్రజాప్రతినిధులు విలువైన సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. అన్నింటినీ పరిగణలోకి తీసుకుని విధివిధానాలు రూపొందిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. రేషన్ కార్డులు ఉన్నవారందరికీ 6 కిలోల ఉచిత బియ్యం ఇస్తున్నట్లు గుర్తు చేశారు.గత ప్రభుత్వం 10 ఏళ్లలో కేవలం 49 వేల రేషన్ కార్డులు మాత్రమే ఇచ్చిందని ఉత్తమ్ ఆరోపించారు. సెప్టెంబర్ 21న కేబినెట్ సబ్ కమిటీ మరోసారి సమావేశం కానుంది. ఈ సమావేశంలో కొత్త రేషన్ కార్డుల జారీపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

# చెరువులో నీళ్లు లేవు అన్నారు

**- చెరువులో నీళ్లు లేకుంటే రైతులు పంటలు ఎలా వేశారు...**

**- టిడిపి నాయకులు...**



**నందవరం** మండల పరిధిలోని మాచాపురం గ్రామం వైయస్సార్ నాయకులకు మతిస్థిమితం లేదని టిడిపి నాయకులు అన్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామ టిడిపి ఉప అధ్యక్షులు దేవ సహాయం మాజీ ఎంపిటిసి శ్రీనివాసులు మాభాష మాట్లాడుతూ గ్రామ వైయస్సార్ నాయకులు చెరువులో నీళ్లు లేవు అన్నారు మరి చెరువు దగ్గరికి వస్తే మేము చెరువులో ఉండే నీళ్లను మీకు మేము చూపిస్తామని అన్నారు చెరువులో నీళ్లు లేకుంటే చెరువు ఘరానా 100 ఎకరాల నుంచి 120 ఎకరాలు దాకా వరి నాటలు ఎలా వేస్తారని టిడిపి నాయకులు విమర్శించారు గత ప్రభుత్వంలోనే అంటే మీ ప్రభుత్వంలోనే గత సంవత్సరాలలో వర్షాలు బాగా కురవడంతో నీళ్లు ఎక్కువగా ఆగడం ద్వారా పంట పొలాలు నీటిలో మునిగి పోవడంతో చిలకలదోన గ్రామానికి చెందిన ఒక రైతు కోర్టును ఆశ్రయించడం జరిగింది చిలకలదోన గురురాఘవేంద్ర ప్రాజెక్టు కడగొమ్మను ఎత్తు ఎక్కువగా ఉండటంతో నా పొలం మొత్తం నాశనం అయిపోయిందని అందువలన కడగమ్మను ఒక అడుగు తగ్గించడానికి కోర్టు ఆశ్రయించాడు

అప్పుడు కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది అధికారులు ఏ ఈ, డి ఈ, కడగొమ్మను దగ్గరుండి పగలగొట్టడం జరిగింది అప్పుడు మీరు అధికారంలో ఉన్నారు కదా మరి మీరు ఎందుకు ఆ పని నిలబెట్టే లేక పోయినారు 2023 సంవత్సరంలో చేతికి వచ్చిన పంటను చాలామంది రైతులు పంటను కోయడం జరిగింది అప్పుడు మీరు కూడా అధికారంలో ఉన్నారు కదా 2022లో తుంగభద్ర నది జలాశయం నీళ్లు కిందికి వృధాగా పోతుంటే మీరు ఎందుకు చెరువు నింపు లేదు ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు నెలలు కూడా కాలేదు ఎమ్మెల్యే బి వి జయ నాగేశ్వర్ రెడ్డి మాజీ సర్పంచ్ కాసింవలి సహకారంతో ఎల్ ఎల్ సి నీళ్లు వారం రోజులుగా చెరువులోకి నీళ్లు పారించడం జరిగింది చెరువులో నీళ్లు లేనిదే రైతులు పంటలు ఎలా వేస్తారు మీకు చెరువులోకి నీళ్లు కనపడకుంటే మేము మీకు దగ్గర నుంచి నీళ్లు చూపిస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుభాష్,తేజేశ్వర నాయుడు, రత్నం, భూపతి, చిన్న రాజు,మరియు రైతులు పాల్గొన్నారు.

# 800 కేజీల తృణ ధాన్యాలతో 12 గంటలు శ్రమించి పీఎం మోదీ చిత్రాన్ని గీసిన 13 ఏళ్ల బాలిక

**న్యూ ఢిల్లీ :** 800 కేజీల తృణధాన్యాలతో 12 గంటలు శ్రమించి పీఎం మోదీ చిత్రాన్ని గీసిన 13 ఏళ్ల బాలిక చెన్నైకి చెందిన 13 ఏళ్ల బాలిక 12 గంటలు కష్టపడి 800 కేజీల తృణధాన్యంతో పీఎం నరేంద్ర మోదీ చిత్రాన్ని గీసి ప్రపంచ రికార్డు సృష్టించింది. దీంతో ప్రపంచంలోనే అతిపెద్ద మిల్లెట్ పెయింటింగ్ గా ఇది యూనికో వరల్డ్ రికార్డుని సొంతం చేసుకుంది. ప్రెస్లీ షెకీనా అనే బాలిక సెప్టెంబరు 17న ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకొని తృణ ధాన్యాలతో 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ భారీ చిత్రాన్ని రూపొందించింది. కాగా ప్రెస్లీ ఓ ప్రైవేట్ స్కూల్లో 8వ తరగతి చదువుతోంది.

*రోటరీ క్లబ్ ఆఫ్ లైవ్ సిటీ పిడుగురాళ్ల ఆధ్వర్యంలో*

# 100 మందికి వీల్ ఛైర్స్

**115 మందికి జైపూర్ కాళ్లు పంపిణీ**



**పిడుగురాళ్ల :** రోటరీ క్లబ్ ఆఫ్ లైమ్ సిటీ పిడుగురాళ్ల ఆధ్వర్యంలో సోమవారం 100 మందికి వీల్ చైర్స్ ఉచితంగా అందజేశారు. అలాగే 115 మంది వికలాంగులకు కృత్రిమ జైపూర్ కాళ్లు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ కె.శరత్ చౌదరి హాజరయ్యారు. అనంతరం గవర్నర్ శరత్ చౌదరి చేతుల మీదుగా వందమందికి వృద్ధులకు వీల్ చైర్స్ వికలాంగులకు కృత్రిమ జైపూర్ కాళ్లు అందజేశారు.ఈ కార్యక్రమం రోటరీ క్లబ్ అధ్యక్షులు గుండా అశోక్ కుమార్, సెక్రెటరీ నీరుమళ్ళ రాజేష్, ట్రెజరర్ గుర్రం కృష్ణ కాంత్, పలువురు, పిడుగురాళ్ల రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలి యువతి మృతి కేసులో ట్విస్టు

**హైదరాబాద్ :** గచ్చిబౌలి స్టాఫ్‌నర్స్ మృతి కేసులో షాకింగ్ అప్‌డేట్స్ వెలుగు చూస్తున్నాయి. జడ్చర్ల నుంచి రెండ్రోజుల క్రితం యువతి హైదరాబాద్ వచ్చింది. ఓ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా చేసిన మృతురాలు.. రెండు వారాల క్రితమే మానేసింది. హైదరాబాద్‌లో గణేశ్ వేడుకలను చూసేందుకు హైదరాబాద్ వచ్చినట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఆదివారం కాల్ చేస్తే మంచిగానే మాట్లాడిందని.. రాత్రికి ఇలా ఉరేసుకుని చనిపోయిందని చెప్పడం షాక్‌కు గురిచేస్తోందంటున్నారు పేరెంట్స్. ఆమె ఒంటిపై గాయాలున్నాయని.. ఆమెను రేప్ చేసి, అనంతరం ఉరేసి చంపేశారని ఆరోపణలు చేస్తున్నారు.ఆదివారం రాత్రి స్నేహితులు మోనా, జీవన్ మరో అబ్బాయితో కలిసి యువతి హోటల్‌కు వెళ్లింది. అక్కడ పార్టీ జరిగినట్లు తెలుస్తోంది. హోటల్‌లో రెండు గదులు తీసుకున్నారు. ఆమె చనిపోయిన గదిలో బీరుబాటిల్స్ ఉన్నాయి. తాము నలుగురం కలిసి పార్టీ చేసుకున్నట్లు జీవన్, ఆమె తల్లిదండ్రులకు ఫోన్‌లో చెప్పాడు. మీ కూతురు ఉరేసుకుని చనిపోయిందని చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు, హోటల్ దగ్గరకు వచ్చేసరికి డెడ్‌బాడీని అంబులెన్సులోకి ఎక్కించారు. గది నిండా రక్తం మరకలు కనిపిస్తున్నాయి. తమ కూతురు ఒంటిపై గాయాలున్నాయంటున్నారు పేరెంట్స్. తాము వచ్చే వరకు డెడ్‌బాడీని స్పాట్‌లోనే ఎందుకు ఉంచలేదని ప్రశ్నిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. తర్వాత తామంతా హోటల్ నుంచి బయటకు వెళ్లామని? తనకు తలనొప్పిగా ఉందని తమతో రాలేదని యువతి ఫ్రెండ్స్ చెబుతున్నారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు తామంతా తిరిగి వచ్చామని.. రూమ్ లోపలి నుంచి గడియ వేసుకుని ఎంతకీ తీయలేదన్నారు. హోటల్ సిబ్బందికి చెప్పడంతో వారు మాస్టర్ కీతో తలుపు తీశారని.. అప్పుడు లోపల ఫ్యానుకు ఉరివేసుకుని కనిపించిదని యువతి ఫ్రెండ్స్ చెబుతున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# నెత్తురు పారిన నేలలో ఎత్తిన ఎర్రని పిడికిళ్ళు



**- తెలంగాణ సాయుధ పోరాటం(1948-51)-సిరిసిల్ల.**

**- దొరల నెత్తుటిలో నడిచిన చారి సాబ్**



సిరిసిల్ల నియోజకవర్గ తొలి శాసన సభ్యులు.



వెంకటాచారి ( చారి సాబ్ )

**(దుర్గం విజయ్ బాబు - ప్రశ్న న్యూస్ బ్యూరో)**

సెప్టెంబర్ 17 చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రత్యేక స్థానం ఉన్నది. సామాన్యులను అసమాన్యులుగా మలచి భూమి భుక్తి విముక్తి కోసం సాగిన మహత్తర పోరాటమది. తెలంగాణ పోరాట విరమణ సందర్భంగా పురస్కరించుకొని, విమోచన, విలీన దినోత్సవాలు జరుపుతున్న సందర్భం. తెలంగాణ సాయుధ పోరాటంలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు ప్రత్యేక స్థానం ఉన్నది. సెప్టెంబర్ 17 సందర్భంగా ఆనాటి కొన్ని జ్ఞాపకాలను" ప్రజా ప్రశ్న" ప్రత్యేక కథనం అందిస్తుంది.

తెలంగాణ సాయుధ పోరాట కాలం నాటికి సిరిసిల్ల పాత తాలూకా పరిధి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భాగమై ఉండేది. సిరిసిల్ల పాత తాలూకా పరిధి ప్రస్తుతం జిల్లాలో 13 మండలాలతో జిల్లాగా కొనసాగుతుంది.

తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఈ ప్రాంతంలో చెరగని ముద్ర వేసిన అనేకమంది వీరుల చరిత్ర అందుబాటులో లేకుండా పోయిన పరిస్థితి ఉంది.

సిరిసిల్ల పట్టణంలో 1935 సెప్టెంబర్ 6న



జరిగిన ఆంధ్ర మహాసభ నాలుగవ మహాసభలు ఈ ప్రాంతంలో ప్రజల్లో స్వాతంత్ర ఉద్యమ కాంక్షతోపాటు అనంతర కాలంలో సాయుధ పోరాటం మలుపు తీసుకునే వరకు ప్రత్యేకంగా నిలిచింది. మాహాసభల నిర్వహణ రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి గ్రామానికి చెందిన బద్దం ఎల్లారెడ్డి, తంగళ్ళపల్లి మండలం లక్ష్మీపూర్ (తాల్లళ్లపల్లి) గ్రామానికి చెందిన సింగిరెడ్డి భూపతి రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకుంటూ మహాసభలో పాల్గొన్నారు. కీలక నాయకుల్లో ఒకరుగా బద్దం ఎల్లారెడ్డి అప్పటికే ఉన్నారు. బద్దం ఎల్లారెడ్డి ప్రభావంతో అమృతలాల్ శుక్ల పోరాటం లో కీలకంగా పనిచేసారు. సింగిరెడ్డి భూపతి రెడ్డి, 1930లో తాసిల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్ గా పనిచేసే అక్కడ జరిగే దుర్మార్గాలను సహించలేక పూర్తి కాలం కార్యకర్త గా తనతోపాటు అనేకమంది నీ ఉద్యమంలో భాగస్వాములను చేస్తూ ముందుకు సాగారు. మహమ్మదాపూర్ గుట్టల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో వీరోచితంగా పోరాడుతూ అనభేరి ప్రభాకర్ తో పాటు తన సహచరులతో సింగిరెడ్డి భూపతి రెడ్డి అసువులు బాసారు.

1947 సెప్టెంబర్ 14న గాలి పెల్లి లో నిజాం మూకలు జరిపిన కాల్పుల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో బద్దం ఎల్లారెడ్డి ఇద్దరు చూపులేని దంపతులకు తన ఇంటి దగ్గరలో కొంత చోటిచ్చాడు. నిజాం రజాకర్ ముకలు జరిపిన ఆ కాల్పులో వృద్ధ దంపతులు కూడా ప్రాణాలు కోల్పోవడం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. ప్రజల ఆగ్రహానికి కారణం అయ్యింది.

తెలంగాణ సాయుధ పోరాట రూపం తీసుకున్న అనంతరం సిరిసిల్ల పాత తాలూకా పరిధిలోని అన్ని ప్రాంతాలకు పోరాటం విస్తరించింది. వేములవాడ నుంచి గుమ్మి పుల్లయ్య, మహారాష్ట్ర లోని గుల్బర్గా జైలులో నిర్బంధించిన సహచరులతో కలిసి తప్పించుకొని తిరిగి పోరాటాలో భాగస్వాములు అయ్యారు. చందుర్తి బండ లింగంపల్లి నుంచి బండపల్లి తిరుపతిరెడ్డి, రాఘవరెడ్డి సోదరులు అమృత లాల్ శుక్ల దళం లో సభ్యులుగా సిరిసిల్ల సరిహద్దులు దాటి నిజామాబాద్ జిల్లా వరకు పోరాట విస్తరణలో కీలకంగా పని చేశారు. అప్పట్లో గ్రామీణ యువతకు సాయుధ శిక్షణ ఇవ్వడం కోసం మానాల ప్రాంతంలో ఏర్పాటు చేసిన క్యాంప్ ద్వారా ఎందరో యువకులు సాయుధ వీరులై ముందుకు సాగారు. అప్పట్లో గడ్డం సోదరులు చేసిన సాహసోపేతమైన ఓ ఘటన సంచలనంగా మారింది. నిజామాబాద్ జిల్లా జైలులో ఎత్తైన గోడలను తాము ధరించే దోవతుల తో తాడుల పేని జైలు గోడలు దుంకి తప్పించుకొని తిరిగి పోరులో ముందుకు సాగరు.


మరో సంఘటన రుద్రంగి మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం గుట్టపై శుక్లదళం ఉందన్న సమాచారంతో రజాకర్ మూకలు చుట్టుముట్టాయి. గమనించిన శుక్లా దళం ఎదురు కాల్పులు ప్రారంభించారు. ఈ కాల్పులు ఒకే తూట తో ఇద్దరు నిజాం మూకలను కాల్చి చంపడం అప్పట్లో పెద్ద సంచలనం. 1950 జులై 10 అమృతరాల్ శుక్ల దళం సిరిసిల్ల పోలీస్ స్టేషన్ దాడి చేసిన ఘటన కూడా చారిత్రాత్మకమే.

ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామానికి చెందిన "చారి" (వెంకటచారి) దళం ప్రజల కోసం సాహసోపేతంగా పని చేసింది. ఈ క్రమంలో చారి సబ్ ప్రజల్లో అభిమానం పొందిన ఆయన జీవితం చివరి వరకు ప్రజల కోసం జీవించారు. చారిసాబ్ కు ఆనాటి సర్కారు ఉరిశిక్ష విధించడంతో సోవియట్ రష్యా నుంచి న్యాయవాదులు కేసు వాదించడం కోసం వచ్చారని అనంతరం ఆయన విడుదలైన ఘటన గురించి ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు.కోనరావుపేట్ మండలం మల్కాపేట గ్రామానికి చెందిన కర్రోల్ల నరసయ్య తన జీవితమంతా కమ్యూనిస్టు ఉద్యమానికి ధారపోసారు. సాయుధ పోరాట అనంతరం ఆయన పిడిఎఫ్ అభ్యర్థిగా నేరెళ్ల శాసనసభ్యులుగా కూడా పనిచేశారు.

## తొలి అదృశ్యం కేసు..

కొనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన 1949 ప్రాంతంలో రావుల వెంకటరెడ్డి చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలకు ఏ కష్టం వచ్చినా ముందు నిలబడే వాడు. వెంకట్ రెడ్డి పై కక్ష కట్టిన స్థానిక భూస్వాములు నిజాం ప్రశాకర్ మూకలతో కలిసి కుట్రపన్ని దాడికి రెండు లారీలు వచ్చిన రజాకర్ ఒక విధంగా మూకను రెండు లారీలలో వచ్చి వెంకట్ రెడ్డి పశువుల కొట్టంలో ఉండగా వెంకట్ రెడ్డి విపరీతంగా కొట్టి లారీల్లో వేసుకో పోయారు. తర్వాత ఆయన ఆచూకీ దొరకలేదు. సిరిసిల్ల ప్రాంతంలో తొలి అదృశ్యం కేసు ఇదే కావచ్చు.

తెలంగాణ సాయుధ పోరాటానికి సిరిసిల్ల పాత తాలూకా కేంద్రంగా అనేక ప్రాంతాలకు ఉద్యమం విస్తరించింది. మానాల అడవి ప్రాంతం కేంద్రంగా ఎందరో గ్రామీణ యువకులు వ్యవసాయ కూలీలు శిక్షణ పొంది నిజామాబాద్ జిల్లా సరిహద్దులు దాటి అనేక పోరాటాలలో ముందు నిలబడ్డారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి దీర్ఘకాలం భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా చేన్నమనేని రాజేశ్వరరావు ప్రాతినిధ్యం వహించారు. బద్దం ఎల్లారెడ్డి అత్యధిక మెజార్టీతో పార్లమెంటు ఎన్నిక అయ్యారు. శాసన సభ్యులుగా కూడా పనిచేశారు. కర్రోల్ల నరసయ్య, సిరిసిల్ల తొలి శాసనసభ్యులు మనవాడ శ్రీనివాసరావు పని చేశారు. తెలంగాణ సాయుధ పోరాటం లో ఎందరో తమ ప్రాణాలను తృణపాయంగా అర్పించిన "చరిత్ర"పూర్తి స్థాయిలో రికార్డు చేయలేక పోయారు.



## అతని పేరు వెంకటాచారి ప్రజలు పెట్టుకుంది చారి సాబ్ దొరల నెత్తుటిలో నడిచిన చారి సాబ్ రష్యా నుంచి వచ్చి వాదించిన లాయర్లు

కష్టాలు, కన్నీళ్లు, వెట్టిచాకిరి, దౌర్జన్యాలు, అత్యాచారాలు, అవమానాలే ఆ మట్టి మనిషిని తట్టిలెపాయి. ఆలోచనలే పునాదుల అయ్యాయి. పనిముట్లే ఆయుధాలయ్యాయి%ౌ% ! గడ్డి కోసిన చేతులే గొడ్డలను ఎత్తించాయి..! దండం పెట్టిన చేతులే కొడవళ్లను పట్టాయి. బంచాన్ దొర కాల్మొక్తా అన్న గొంతులే భూస్వాములు, పటేళు ,, దొరల అరాచాకలపై గర్జించాయి.

పటేళ్లు, దొరల అరాచాకలపై గర్జించాయి. ఈ పరిణామాలే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంగా మారాయి. సిరిసిల్ల ప్రాంతం నుండి కీలకంగా వ్యవహరించిన చారి సాబ్ చరిత్రను విస్మరిస్తూ అతడి చరిత్రను అదృశ్యం చేస్తూ, ఉనికిని ప్రశ్నార్థకంగా మార్చిన అదృశ్య శక్తుల పన్నాగంలో ఇన్నాళ్లు మరుగున పడ్డ చారి సాబ్ గత చరిత్ర ఇన్నాళ్లకు బయటకు వస్తున్నందుకు ప్రజలు సంతోషపడతారని ఆశిస్తున్నాం.

## బద్దిపడగ దొరల నెత్తుటిలో నడిచిన చారి సాబ్

7 దర్వాజలు దాటితేనే దొరను చేరుకుంటారు. దర్వాజకు ఇద్దరు చొప్పున కావాలి వాళ్లు ఉంటారు. అలాంటి దర్వాజాలు దాటుకుని దొరను చేరాలంటే మామూలు విషయం కాదు. అలాంటిది దొర గడిలో ప్రవేశించి ఆ దొరలను మట్టు పెట్టి బయటపడ్డాడు అంటే అతను ఎవరో ఊహించండి. అతనే చారి సాబ్. అలాంటి ఘటనలు ఎన్నో అతడి ఆధ్వర్యంలో జరిగాయి. అతని ధైర్యానికి మెచ్చి తన బాటలో నడిచారు ఎంతోమంది ప్రజలు. ఎద్దు కావాలని బద్దిపడగ గ్రామానికి చేరాడు. సాయంకాలం అవుతుంది పొద్దున ఎద్దును కొనుక్కొని వెళ్ళమని గ్రామస్తులు చెప్పారు. దొర గడిలో నిద్రించి, అర్ధరాత్రి దొరను మట్టుపెట్టి గడిని దాటి వెళ్ళాడు. దొర చేసిన ఆకృత్యాలను ప్రజలు తలుచుకొని తెలంగాణ సాయుధ పోరాటంలో తమ వంతు సేవలు అందించారు. ఎంతోమంది ప్రజలను తెలంగాణ సాయుధ పోరాటంలో అడుగులు వేసెల బీజం వేశాడు.

## ఆ చెరువు తూమే నిలయమైంది

కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు ప్రభుత్వం నుండి జారీ అయ్యాయి. ఆవునూరు చెరువు తూములో అతడు నివాసం ఏర్పాటు చేసుకొని 3 నెలలు కాలం వెలదీశాడు. నిర్బంధాన్ని ఎదుర్కొంటూ మత్స్యకారులు తెచ్చిన ఆహారాన్ని తింటూ కాలాన్ని విలువ తీసుకుంటూ, ప్రాణాన్ని కాపాడుకున్నాడు. చారి సాబ్ కోసం ప్రాణాన్ని సైతం ప్రాణంగా పెట్టి ఆహారాన్ని అందించిన ఆ మత్స్యకారుల పేర్లను కూడా తను వెల్లడించలేదు. తమ పేర్లు చెబుతూ తమకు తమ కుటుంబానికి రజాకర్ల నుండి హాని ఉంటుందన్న మాటలకు అన్నం పెట్టిన పేర్లు వెల్లడించలేదు.

## రష్యా నుండి వచ్చి వాదించిన లాయర్లు

25 మందికి మరణశిక్ష విధించబడింది. అందులో సిరిసిల్ల ప్రాంతం నుండి పరవస్తు వెంకట చారి కూడా ఉన్నారు. రష్యా నుండి వచ్చిన లాయర్లు వాదించడంతో కేసు కొట్టు వేయబడింది.

## రెండు పర్యాలు సర్పంచ్‌గా పనిచేసిన వెంకటాచారి

సర్పంచ్ గా ఎన్నికైన వెంకటాచారి ఆవునూరు గ్రామానికి ఎనలేని సేవలు అందించారు. సిరిసిల్ల తాలూక లో ఉన్న ఎస్సీ హాస్టల్ లాంటిది మా గ్రామంలో ఉండాలి అని అవును గ్రామంలో ఎస్సీ హాస్టల్ ను మంజూరు చేయించుకున్నారు. తమ గ్రామ పాఠశాలలో 10వ తరగతి వరకు ఉన్నత పాఠశాలను నెలకొల్పుకున్నారు. తన ప్రాంతానికి ఎన్నో విశేష సేవలను అందించిన ఘనత చారి సాబ్ సొంతం.

## చారి సాబ్ కుటుంబ నేపథ్యం

చారి సాబ్ కుటుంబ నేపథ్యం వ్యవసాయ కుటుంబం. తండ్రి వరద చారి, తల్లి గోదా దేవి, అన్నదమ్ములు రామాంజ చారి, యతేంద్ర చారి, రామాచారి,

భార్య అనసూయ, కుమారులు ఉదయ్ భాస్కర్, ప్రేమ్ చంద్ వీరిది వెంకటాపూర్ గ్రామం. చుట్టుపక్కల గ్రామాల్లో స్థిరపడ్డారు. వెంకటాచారి కుటుంబం ఆవునూరు గ్రామంలో స్థిరపడింది.

## చారి సాబ్ కుమారుడు ప్రేమ్ చంద్

సిరిసిల్ల ప్రాంతంలో సేవ్ సంస్థ ద్వారా ఎన్నో సేవలు అందించాడు. తండ్రి బాటలోనే సర్పంచ్ గా గ్రామంలో విశేష సేవలు అందించాడు.

---

**జర్నలిస్టు సూర్యప్రకాష్‌కు అండగా**

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**- వైద్య ఖర్చులకు రూ.10 లక్షలు మంజూరు**

**- మంగళవారం చెక్ అందజేయనున్న అధికారులు**

**- సీఎం స్పందన పై కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం**



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** జర్నలిస్టులకు నేను అండగా ఉంటానని మాట ఇచ్చిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అనారోగ్యానికి గురై ఢిల్లీలోని మాక్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ జర్నలిస్టు కేవీఎన్ఎస్-ఎస్ ప్రకాష్ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఢిల్లీలో సాక్షి జర్నలిస్టుగా పని చేస్తున్న కేవీఎన్ఎస్ఎస్ ప్రకాష్ మెదడులో రక్తం గడ్డకట్టడంతో అనారోగ్యానికి గురై మూడు రోజుల క్రితం ఢిల్లీలోని ఆసుపత్రిలో చేరారు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించారు. ప్రకాష్ వైద్య ఖర్చులకు రూ.పది లక్షలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన చెక్కును మంగళవారం ఢిల్లీలో అధికారులు ఆయన కుటుంబ సభ్యులకు అందజేయనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణ స్పందన పై తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనం చిన్ని వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రాణాల మీదికి తెస్తున్న రీల్స్ పిచ్చి



**హన్మకొండ(ప్రశ్న న్యూస్)** రోజురోజుకు యువతలో సెల్ఫీ పిచ్చి పెరిగిపోతోంది.సెల్ఫీలు దిగాలి సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలన్న పిచ్చితోవాటికి వచ్చే లైక్సను కామెంట్స్‌ను చూసి సంబరపడాలి అని ఇందు కోసం కొందరు ఎంత దూరమైనా వెళ్తున్నారు.చివరికి ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారు కొందరురీల్స్ మోజులో పడి ప్రాణాల మీదికి తెచ్చుకున్న సంఘటనలు ఎన్నో జరుగుతున్న కనువిప్పు మాత్రం కలగడం లేదు.తాజాగా ఇలాంటి ఓ ఘటన కాజీపేట మండలం కడిపికొండ రాంనగర్ సమీపంలో రైల్వే ట్రాక్ పై ఆగివున్న గూడ్స్ రైలు మీద ఎక్కి సెల్ఫీలు దిగుతూ రీల్స్ చేస్తున్న క్రమంలో హై టెన్షన్ విద్యుత్ ఘాతానికి గురై 70% కాలిన గాయాలతో ఎంజీఎం కు 108 లో తరలించారు. ఇలా చాలామంది యువకులు, యువతులు సెల్ఫీలు, రీల్స్ పేరుతో గాయాల పాలవుతూ ప్రాణాలు తీసుకుంటున్నారు. తమ కుటుంబాలకు విషాదాన్ని మిగులుస్తున్నారు

# ప్రపంచ ఫార్మా బ్రాండ్‌గా హైదరాబాద్

**- జీనోమ్ వ్యాలీలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** హైదరాబాద్ బ్రాండ్‌ను ప్రపంచంలోనే ఒక ఫార్మా కంపెనీల బ్రాండ్‌గా తీర్చిదిద్దుతామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జినోమ్ వ్యాలీలోని పరిశ్రమల ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 30,40 ఏళ్లుగా కృషి చేస్తున్న ఫార్మా పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం, సకల వసతులు కల్పిస్తూ మరిన్ని పెట్టుబడులు వచ్చే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కృషి చేస్తున్నామని చెప్పారు. సోమవారం లారస్ ల్యాబ్స్, కర్క ల్యాబ్స్ సుమారు 300 ఎకరాల్లో రూ. 2వేల కోట్లతో వందల మందికి ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలను ప్రారంభించాయన్నారు. ప్రపంచ ఫార్మా దృష్టిని ఆకర్షించేందుకు జినోమ్ వ్యాలీని ప్రపంచస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఫార్మా రంగంలో పెట్టుబడులకు స్వర్గధామంలా తయారు చేసి ఉపాధి అవకాశాలు, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అందుకే, ఫార్మా కంపెనీల దిగ్గజాలతో మరిన్ని పెట్టుబడులు రాబట్టే విషయమై చర్చించామన్నారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మలా జయప్రకాశ్‌రెడ్డి, ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు, పలు ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# దీర్ఘకాల పెట్టుబడులకు ఎన్‌పీఎస్ వాత్సల్య

**-18న ప్రారంభించనున్న నిర్మలమ్మ**

న్యూఢిల్లీ,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ):తమ పిల్లల భవిష్యత్ కోసం దీర్ఘకాలం పెట్టుబడి పెట్టాలనుకునే వారికోసం బ్జడెట్‌లో ప్రకటించిన ఎన్‌పీఎస్ వాత్సల్యను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సెప్టెంబర్ 18న ప్రారంభించనున్నారు. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి, ఆర్థిక శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని సమాచారం. పథకం ప్రారంభంతో పాటు విధివిధానాలు తెలియజేయనున్నారు. 18 ఏళ్లలోపు బాలబాలికల పేరుతో తల్లిదండ్రులు/సంరక్షకులు ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతా తీసుకోవచ్చు. పిల్లలు మేజర్లు అయ్యాక ఈ ఖాతా సాధారణ ఎన్‌పీఎస్ (ఔఖా) ఖాతాగా మారుతుందని జులైలో ప్రకటించిన బ్జడెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. దేశంలోని ప్రజలందరికీ సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో 2004లో తీసుకొచ్చిన ఎన్‌పీఎస్.. పన్ను ప్రయోజనాలతో పాటు, దీర్ఘకాలిక పెట్టుబడి పథకంగా బాగా ప్రాచుర్యం పొందింది. దీన్ని ఇప్పుడు మరింత విస్తృత పరుస్తూ మైనర్లకూ వాత్సల్యను అందుబాటులోకి తేవడం గమనార్హం. సుకన్య సమృద్ధి యోజన, పీపీఎఫ్ వంటి మదుపు పథకాలకు ఇది అదనం. ఎన్‌పీఎస్ వాత్సల్య వల్ల ముందుగానే పెట్టుబడులు ప్రారంభించడానికి వీలు పడుతుంది దీనివల్ల చక్రవడ్డీ ప్రయోజనాన్ని పొందే అవకాశం ఉంటుంది. మైనర్లుగా ఉన్నప్పుడే ఎన్‌పీఎస్ ఖాతా తెరవడం వల్ల రిటైర్మెంట్ నాటికి పెద్ద మొత్తంలో కార్పస్ సమకూరుతుంది. ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతా వల్ల చిన్నతనంనుంచే తమ పిల్లలకు నుంచే పొదుపు అలవాటు చేయొచ్చు. సాధారణంగా ఎన్‌పీఎస్‌లో టైర్-1, టైర్-2 ఖాతాలుంటాయి. టైర్-1 ప్రాథమిక పింఛను ఖాతా. ఇందులో చేరినప్పుడు ఉపసంహరణలపై కొన్ని పరిమితులు ఉంటాయి. టైర్-2లో స్వచ్ఛంద పొదుపు పథకంలాంటిది. ఎన్‌పీఎస్‌లో పెట్టుబడిపై సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద రూ. 50,000 వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది. ఇది సెక్షన్ 80సీ పరిమితి రూ. 1,50,000కు అదనం. పదవీ విరమణ తర్వాత (60 ఏళ్లు) ఎన్‌పీఎస్ నిధిలో 60 శాతాన్ని ఒకేసారి వెనక్కి తీసుకోవచ్చు. మిగతా 40 శాతంతో తప్పనిసరిగా యాన్యుటీ పథకాలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీని ద్వారా పదవీ విరమణ తర్వాత పింఛను పొందేందుకు వీలవుతుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers".
H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588